సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
గురువారం, 05.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 364
పేజీలు: 08 వెల: రూ. 5

జర్నలిజం విశ్వసనీయతకు సవాల్..

ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

6




- ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం!
- ప్రజా సమస్యలపై ప్రశ్నించే ధైర్యం కోల్పోవద్దు
- దారి తప్పుతున్న జర్నలిజాన్ని గాడిలో పెట్టాలి
- నకిలీ జర్నలిస్టుల బ్లాక్‌మెయిలింగ్‌కు అడ్డుకట్ట వేయాలి
- జర్నలిస్టుల హక్కుల సాధనలో రాజీపడేది లేదు
- రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

నిధుల మంటలు

కాంగ్రెస్‌లో ముదురుతున్న అసమ్మతి సెగలు!

రేవంత్ సర్కార్‌కు సొంత ఎమ్మెల్యేల షాక్!

- నిధులు లేవు.. ప్రాధాన్యత లేదంటూ ఆవేదన!
- రాజగోపాల్, అనిరుధ్ రెడ్డి తిరుగుబాటు స్వరం!
- టెండర్ల పంచాయితీతో కాంగ్రెస్‌లో కలకలం!
- ఎమ్మెల్యేల అసంతృప్తిపై అధిష్ఠానం గుర్రు!
- హెచ్చరికలతో చల్లారని అసమ్మతి మంటలు!
- మరికొందరు ఎమ్మెల్యేలు అదే బాటలోనా?
- ప్రతిపక్షాలకు అస్త్రంగా మారుతున్న కాంగ్రెస్ విభేదాలు!
- చిన్న నిప్ప.. పెద్ద దావానలంగా మారేనా?



ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత అసమ్మతి మరోసారి భగ్గుమంటోంది. అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా పార్టీలో విభేదాలు మాత్రం చల్లారడం లేదు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సొంత ప్రభుత్వంపైనే బహిరంగ విమర్శలకు దిగడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. నియోజకవర్గాలకు నిధులు రావడం లేదని, ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యత లేదని, అభివృద్ధి పనుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేల మాదిరిగా పోరాడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, ఈ అసంతృప్తి వెనుక నిధులు, పదవులతో పాటు టెండర్ల కేటాయింపుల అంశం కూడా కీలకంగా మారినట్లు చర్చ జరుగుతోంది. హైదరాబాద్ రేడియల్ రోడ్ల టెండర్లలో స్థానిక కాంట్రాక్టర్లను పక్కనపెట్టి ఏపీ కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ఇక జడ్చర్లలో అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు, నిధుల విడుదలలో జాప్యంపై అనిరుధ్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఆమరణ దీక్ష హెచ్చరికలు చేయడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

ఈ ఇద్దరు ఎమ్మెల్యేల వ్యాఖ్యల వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, వారి అసంతృప్తిని ప్రభుత్వం తేలిగ్గా తీసుకుంటోందా? లేక సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. మిగతా 02లో

సదర్‌కు ₹5 కోట్లు

యాదవుల ఇళ్లలో రూ.కోట్లు ఉంటాయి: సీఎం రేవంత్ రెడ్డి




- సదర్ అంటే జల్సా కాదు.. యాదవుల ఆత్మగౌరవ ప్రతీక
- సదర్‌కు రాష్ట్ర పండుగ హోదా.. రూ.5 కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకం
- జనాభా ప్రాతిపదికన యాదవులకు న్యాయం చేస్తాం

ముద్ర, హైదరాబాద్ :
యాదవ సోదరుల సహకారంతోనే హైదరాబాద్ ఇంతగా అభివృద్ధి చెందిందని సదర్ సమ్మేళనంలో సీఎం రేవంత్ వారిపై ప్రశంసలు కురిపించారు. 'ఈ సదర్ యాదవులకే కాదు.. ప్రజలందరికీ మిగతా 02లో

కండక్టర్ మృతి

ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం అండ



- దాడులు వద్దు: పొన్నం ప్రభాకర్
- తల్లికి ప్రభుత్వ ఉద్యోగం.. ఇందిరమ్మ ఇల్లు
- కుటుంబానికి రూ.కోటి ప్రమాద బీమా
- ఆర్టీసీ తరపున రూ.10 లక్షల పరిహారం

2

ఇంచు కూడా కొనద్దు

కేటీఆర్ వార్నింగ్

- మియాపూర్ 550 ఎకరాల భూమిపై ఆగ్రహం
- పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని డిమాండ్
- ఏడాదిలో కేసీఆర్ అధికారంలోకి వస్తారని ధీమా



2

ట్రంప్‌కు షాక్

కాంగ్రెస్‌పై డెమొక్రాట్ల పట్టు..

భారత్‌పై ప్రభావమెంత?

- అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్ల ఘన విజయం
- సెనేట్, హౌస్ రెండింటిలోనూ ఆ పార్టీకే మెజారిటీ
- ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా తీర్పుగా విశ్లేషణ
- భారత్‌తో వాణిజ్యం, హెచ్-1బీ వీసాలపై ప్రభావం ఎంత



ముద్ర, న్యూఢిల్లీ:
అమెరికాలో జరిగిన 2026 మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రతిపక్ష డెమొక్రాటిక్ పార్టీ యూఎస్ కాంగ్రెస్‌లోని ఉభయ సభల్లోనూ పట్టు సాధించింది. సెనేట్‌లో 5 సీట్లు, ప్రతినిధుల సభ (హౌస్)లో అరడజనుకు పైగా స్థానాలు గెలుచుకుని కాంగ్రెస్‌పై పూర్తి నియంత్రణ సాధించింది. ఈ ఎన్నికల్లో తననే బ్యాలెట్‌పై ఉన్న అభ్యర్థిగా భావించి ఓటు వేయాలని ట్రంప్ ప్రజలను కోరిన నేపథ్యంలో ఈ ఫలితాలు ఆయన విధానాలకు వ్యతిరేకంగా వచ్చిన ప్రజా తీర్పుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక ఆయన తీసుకున్న పలు నిర్ణయాలపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా నిత్యావసరాల ధరల పెరుగుదల, ఇరాన్‌తో యుద్ధం కారణంగా పెరిగిన ఇంధన ధరలు, వాణిజ్య సుంకాల (టారిఫ్‌లు) విధానాలు రిపబ్లికన్ పార్టీ విజయావకాశాలను దెబ్బతీశాయి.

ట్రంప్ అప్రూవల్ రేటింగ్స్ రికార్డు కనిష్ఠ స్థాయికి పడిపోవడం కూడా ఈ ఫలితాలకు కారణమైంది. అధిక ధరలకు ట్రంప్ ప్రభుత్వమే కారణమని చాలా మంది ఓటర్లు భావిస్తున్నారని, అధ్యక్షుడి అధికారాలకు కాంగ్రెస్ ద్వారా అడ్డుకట్ట వేయాలని వారు కోరుకుంటున్నారని 'ది ఏపీ ఓటర్ పోల్' సర్వేలో వెల్లడైంది.

భారత్‌పై ప్రభావం ఎలా ఉంటుంది?

అమెరికా కాంగ్రెస్‌లో డెమొక్రాట్లు పూర్తి ఆధిపత్యం సాధించడం భారత్‌పై కచ్చితంగా ప్రభావం చూపే కీలక పరిణామం. చట్టాల రూపకల్పన, ప్రభుత్వ విధానాలపై దర్యాప్తులు, నిధుల కేటాయింపు వంటి అంశాల్లో డెమొక్రాట్ల బలం పెరగనుంది. అయితే, విదేశాంగ విధానంలో అధ్యక్షుడిదే తుది నిర్ణయం కావడం, వీటో వంటి అధికారాలు ట్రంప్ వద్దే ఉండటంతో మార్పులు అంత సులభం కాకపోవచ్చు. అయినప్పటికీ, భారత ఎగుమతులు, అమెరికాలో పనిచేస్తున్న భారతీయ నిపుణులు, ద్వైపాక్షిక రక్షణ సహకారం వంటి అంశాలపై ఈ ఎన్నికల ఫలితాల ప్రభావం స్పష్టంగా కనిపించనుంది.

వాణిజ్యం, టారిఫ్‌లు

భారత్ ఉత్పత్తులకు అమెరికా అతిపెద్ద మార్కెట్. అందువల్ల అక్కడి టారిఫ్ విధానాల్లో ఏ చిన్న మార్పు జరిగినా అది భారత ఎగుమతులపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది.ఫిబ్రవరి-2026లో ఇరు దేశాలు తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కోసం ఫ్రేమ్‌వర్క్ ప్రకటించాయి. దీని కింద భారత ఉత్పత్తులపై 18% టారిఫ్ విధించాలని అమెరికా ప్రతిపాదించింది. మిగతా 02లో

బాలుడి దత్తత కేసు కొత్త ట్విస్ట్..

హైకోర్టుకు కలెక్టర్



- బాలుడిని తల్లిదండ్రుల నుంచి తిరిగి తీసుకోవాలని పిటిషన్
- గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై స్టే కోరిన అధికారులు
- దత్తత చట్టబద్ధతపై లోతైన విచారణ జరపాలని విజ్ఞప్తి
- సీడబ్ల్యూసీ సంరక్షణకు అప్పగించాలని హైకోర్టును కోరిన కలెక్టర్

2

అగ్నివీర్‌లకు గుడ్‌న్యూస్

సర్వీస్ మరో రెండేళ్లు పొడిగింపు!

- నాలుగేళ్ల తర్వాత కూడా ఉద్యోగ అవకాశం.. కేంద్రం కీలక నిర్ణయం
- అగ్నివీర్‌లకు డబుల్ బెనిఫిట్.. ఆరేళ్లకు సర్వీస్!
- రెండేళ్ల పొడిగింపుతో పెరగనున్న అగ్నివీర్‌ల జీతాలు
- పనితీరు ఆధారంగా పర్మినెంట్ ఉద్యోగాలు..



2

మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



- రాష్ట్రంలో 2,21,500 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పూర్తి
- వివిధ నిర్మాణ దశల్లో 1.90 లక్షల ఇందిరమ్మ ఇళ్లు
- 4 కార్పొరేషన్లలో నిర్మాణం

3

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
గురువారం, 05 నవంబర్, 2026

నీరు తాగడం మర్చిపోవద్దు!

చలికాలంలో దాహం తక్కువగా అనిపించినా శరీరానికి నీరు అవసరం. తగినంత నీరు తాగకపోతే గొంతు, ముక్కులోని శ్లేష్మ పొరలు పొడిబారే అవకాశం ఉంది. కాబట్టి రోజంతా తగినంత నీరు, ఇతర ద్రవాలు తీసుకోవాలి.



అగ్నివీర్‌లకు గుడ్‌న్యూస్



ముద్ర, న్యూఢిల్లీ :
అగ్నిపథ్ పథకంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. నాలుగేళ్ల ప్రాథమిక కాలపరిమితి పూర్తయిన తర్వాత రెగ్యులర్ సర్వీస్‌కు ఎంపిక కాని 75 శాతం మంది అగ్నివీర్‌లలో అర్హులకు మరో రెండేళ్ల పాటు సర్వీస్ పొడిగించనున్నట్లు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి ప్రకటించారు. దీంతో వారి మొత్తం సర్వీస్ కాలం ఆరేళ్లకు చేరుకుంటుంది. ఈ అదనపు రెండేళ్ల సర్వీస్ ముగిసిన తర్వాత ప్రతిభ, పనితీరు ఆధారంగా వారిని మరోసారి రెగ్యులర్ (పర్మనెంట్) కేడర్‌లోకి తీసుకునేందుకు పరిశీలిస్తామని వెల్లడించారు.బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..త్రివిధ దళాలు చేసిన ఈ ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. మొదటి బ్యాచ్ అగ్నివీర్ల నాలుగేళ్ల కాలపరిమితి ముగింపునకు వస్తోందని, వారి పనితీరుపై సానుకూల ఫీడ్‌బ్యాక్ రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 2026 చివరి నాటికి మొదటి బ్యాచ్‌కు చెందిన 18 వేల మందికి పైగా సిబ్బంది నాలుగేళ్ల గడువు పూర్తి చేసుకోనున్నారు. ఇందులో నవంబర్ 21న నేవీ, డిసెంబర్ 21న ఎయిర్‌ఫోర్స్, డిసెంబర్ 31న ఆర్మీ అగ్నివీర్లు తొలి విడత సర్వీస్ ముగించనున్నారు.
అగ్నిపథ్ నిబంధనలు మార్పులేనివి కావని, అనుభవాల ఆధారంగా అవసరమైన మార్పులు ఉంటాయని సీడీఎస్ స్పష్టం చేశారు. పొడిగించిన రెండేళ్ల కాలంలో వారికి మొదటి ఏడాది రూ. 43,500, రెండో ఏడాది రూ. 47,000 చొప్పున వేతనం అందుతుందని, ప్రస్తుతమున్న 'సేవా నిధి' ప్యాకేజీ కూడా యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, ఉన్నత చదువులను (10వ తరగతి నుంచి ఇంటర్, ఇంటర్ నుంచి గ్రాడ్యుయేషన్) మెరుగుపరుచుకునే అవకాశాలను సైతం అగ్నివీర్లకు కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

అమెరికాలో ట్రంప్‌కు గట్టి షాక్..

(మొదటి పేజీ తరువాయి)
అయితే, వాణిజ్య భాగస్వాములపై అత్యవసర అధికారాలను ఉపయోగించి ట్రంప్ విధించిన టారిఫ్‌లను యూఎస్ సుప్రీంకోర్టు కొట్టివేయడంతో, ప్రస్తుతం ఈ సుంకాలు 10 శాతానికి తగ్గాయి.
భారత్–అమెరికా మధ్య పూర్తిస్థాయి వాణిజ్య ఒప్పందం ఇంకా ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. అయితే, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇటీవల మాట్లాడుతూ.. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే దశకు చేరుకుందని చెప్పడం గమనార్హం. డెమొక్రాట్ల నియంత్రణతో ఈ ఒప్పందాలపై మరింత చర్చ జరిగే అవకాశం ఉంది.
హెచ్–1బీ వీసాలు.. వలస విధానాలు
ఈ ఎన్నికల ఫలితాలు అమెరికాలో, ముఖ్యంగా హెచ్–1బీ వీసాలపై పనిచేస్తున్న భారతీయ నిపుణులపై ప్రభావం చూపవచ్చు. కాంగ్రెస్‌లో ఆధిపత్యం మారడంతో భవిష్యత్తులో వలస చట్టాలపై చర్చ, పర్యవేక్షణ పెరగనుంది. అయితే, వీసా నిబంధనల్లో తక్షణ మార్పులు ఉండకపోవచ్చు. డెమొక్రాట్ల విజయం వల్ల వలస విధానాలపై కాంగ్రెస్ పర్యవేక్షణ పెరిగి, రిపబ్లికన్లు ప్రతిపాదించిన కొన్ని కఠిన నిబంధనలు నిలిచిపోయే అవకాశం ఉంది. కొత్త హెచ్–1బీ వీసా దరఖాస్తులకు 100,000 డాలర్ల ఫీజు వసూలు చేయాలన్న ట్రంప్ అధ్యక్ష ప్రకటన వంటివి రద్దు కావడం సులభం కాదు. డెమొక్రాట్లు ఉభయ సభల్లో గెలిచినప్పటికీ, ట్రంప్ వీటో అధికారం, సెనేట్‌లోని ఫిలిబస్టర్ రూల్స్ దూకుడుకు అడ్డుకట్ట వేయనున్నాయి.

నిధుల మంటలు

(మొదటి పేజీ తరువాయి)
అసమ్మతి నేతలను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాల్సిన పార్టీ నాయకత్వం హెచ్చరికలకే పరిమితమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బహిరంగంగా గళం విప్పడంతో, నిధుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మరికొందరు ఎమ్మెల్యేలు కూడా ఇదే బాట పట్టే అవకాశ ముందనే చర్చ కాంగ్రెస్‌లో మొదలైంది. ఇదే జరిగితే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సొంత పార్టీ నుంచే రాజకీయ సవాళ్లు ఎదురయ్యే ప్రమాదం ఉంది.
అధికారంలో మెజారిటీ ఉన్నప్పటికీ, సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ప్రతిపక్షాలకు అది రాజకీయ అస్త్రంగా మారుతుంది. అందుకే సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ నాయకత్వం వెంటనే స్పందించి అసంతృప్త ఎమ్మెల్యేలతో చర్చలు జరపాల్సిన అవసరం ఉంది. నిధుల విడుదల, టెండర్ల వ్యవహారాలు, పదవుల భర్తీపై స్పష్టత ఇవ్వకపోతే కాంగ్రెస్‌లో రగులుతున్న అసమ్మతి సెగలు భవిష్యత్తులో పెద్ద రాజకీయ సంక్షోభానికి దారితీసే అవకాశం లేకపోలేదు.

'ఒక్క ఇంచు కూడా కొనద్దు'

ముద్ర, హైదరాబాద్:
బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక భూ దందాలన్నింటికీ చెక్ పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ 'హిల్ట్' పాలసీ పేరిట హైదరాబాద్‌లో 10వేల ఎకరాలను పారిశ్రామికవేత్తలకు అమ్ముతున్నారని ఆరోపించారు. 'ఏడాది లోపు కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారు. రేవంత్ వేసే ఎంగిలి మెతుకుల కు ఆశపడి పారిశ్రామికవేత్తలు ఈ స్కామ్‌లో భాగం కావొద్దు. మా ప్రభుత్వం భూములన్నీ వెనక్కి తీసుకుంటుంది. ఒక్క ఇంచు కొన్నా వదిలిపెట్టం' అని హెచ్చరించారు. మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమి వస్తే అమ్మేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని కేటీఆర్ విమర్శించారు. ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూడకుండా, పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలన్నారు.
శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఈరోజు బీఆర్ఎస్‌లో చేరారు. 'మియాపూర్‌లోని 550 ఎకరాల్లో 200 ఎకరాలు పేదల ఇళ్లకు, 100 ఎకరాలు అమరవీరులకు, మరో 100 ఎకరాలు ఉద్యమకారులకు కేటాయించండి. మిగిలిన భూమి లో పాఠశాలలు, కాలేజీలు కడితే మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం' అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిలోపే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక భూముల వ్యవహారాలపై దృష్టి సారిస్తామన్నారు.
ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చే చిత్తశుద్ధి ఉందా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలోని ఎర్రవెల్లిలో కాకుండా, హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న మియాపూర్‌లోనే అమరవీరులకు ఇళ్లు కట్టివ్వాలని సవాల్ విసిరారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో జరుగుతున్న స్కాంలో భాగస్వాములైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పారిశ్రామికవేత్తలను ఆయన హెచ్చరించారు.

సదర్‌కు రూ. 5కోట్లు





(మొదటి పేజీ తరువాయి)
ఆత్మగౌరవ సమ్మేళనం. రాష్ట్ర పండుగగా గుర్తించి నిర్వహణకు రూ.5 కోట్లు ఇచ్చాం. సదర్ కోసం క్యాబినెట్ భేటీని వాయిదా వేశాం' అని చెప్పారు. ఒకవేళ RBI బంద్ అయినా యాదవుల ఇళ్లలో ఒకటి, రెండు రూ.కోట్లు ఉంటాయని, వారిలో చాలామంది కోటీశ్వరులు ఉన్నారని చమత్కరించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కానీ, యాదవుల విజ్ఞప్తి మేరకు తమ ప్రభుత్వం సదర్‌ను అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించడమే కాకుండా, దీని నిర్వహణ కోసం రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన చేసి చూపించామని, ఈ తెలంగాణ మోడల్‌ను దేశమంతా అనుసరించేలా సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. తమ ప్రభుత్వంలో యాదవ సామాజిక వర్గానికి రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పించామని వివరించారు.
హైదరాబాద్‌లో నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పాల్గొని యాదవ సోదరులందరికీ సదర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదర్ సమ్మేళనం అనేది కేవలం యాదవులకే పరిమితం కాదని, ఇది తెలంగాణ రాష్ట్ర ప్రజలందరి ఆత్మగౌరవ సమ్మేళనమని అభివర్ణించారు. హైదరాబాద్ సిటీలో నేడు ప్రసిద్ధి చెందిన గోల్కొండ కోట ఒకనాడు 'గొల్ల కొండ'గా ఉండేదని గుర్తుచేశారు. విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ అభివృద్ధిలో యాదవ సోదరుల సహకారం ఎంతో ఉందో కొనియాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు.
యాదవ సోదరులకు తాము ఇచ్చిన ప్రాధాన్యతను ప్రస్తావించారు. అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, అలాగే ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టత కలిగిన యాదగిరిగుట్ట గోశాలలో గోసంరక్షణకు అన్ని రకాల ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో జనాభా ప్రాతిపదికన యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా అన్ని చర్యలు తీసుకుంటామని, వారి ఆత్మగౌరవానికి ఎక్కడా లోటు రాకుండా చూసుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదే అన్నారు.
తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టడమే తమ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర సమగ్ర పురోగతికి మైలురాయిగా నిలిచే మూసీ నది పునరుజ్జీవం, మెట్రో రైలు విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర సంక్షేమం, ప్రగతి కోసమే పనిచేస్తున్న తమ ప్రభుత్వానికి, ఈ బృహత్తర అభివృద్ధి కార్యక్రమాలకు యాదవ సోదరులు సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరారు.



కండక్టర్ ప్రవళిక మృతి

ముద్ర, హైదరాబాద్:
ప్రయాణికురాలి వల్ల చనిపోయిన మణుగూరు డిపో మహిళా కండక్టర్ ప్రవళిక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రవళిక మృతదేహానికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ (MD) నాగిరెడ్డిలు బుధవారం నాడు నివాళులర్పించారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ప్రవళిక తల్లిని పరామర్శించిన మంత్రి పొన్నం, ఆర్టీసీ కుటుంబం అంతా ఆ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ సీఎం ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు కేటాయించనున్నట్లు పొన్నం వెల్లడించారు.అలాగే ప్రభుత్వం, ఆర్టీసీ తరపున ఉమ్మడిగా రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా అందించడంతో పాటు, ఆర్టీసీ ఇన్సూరెన్స్ ద్వారా బ్యాంకుల నుంచి రూ.1 కోటి ప్రమాద బీమా అందిస్తామని తెలిపారు. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బంది లేకున్నా, కోల్పోయిన కుటుంబ సభ్యురాలిని తిరిగి తీసుకురాలేమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఫ్యామిలీ సభ్యురాలిని కోల్పోవడం చాలా బాధాకరం అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే మేనేజ్‌మెంట్ తరపున ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ప్రయత్నించినప్పటికీ దురదృష్టవశాత్తు ప్రవళిక ప్రాణాలు దక్కలేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు కార్మికుల సంక్షేమం, భద్రత కూడా రాష్ట్ర ప్రభుత్వానికి అంతే ముఖ్యమన్నారు. ఈ ఘటనలో నిందితురాలిపై మొదట హత్యాయత్నం కేసు నమోదు చేయగా, ప్రస్తుతం ప్రవళిక మృతితో హత్య కేసుగా మార్చి కఠినమైన చర్యలు తీసుకుంటాం అన్నారు.
దాడులు చేసుకోవద్దు
భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని మంత్రి పిలుపునిచ్చారు. ఒకవేళ తమ ఆర్టీసీ సిబ్బంది ఎక్కడైనా పొరపాటుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అంతేకానీ నేరుగా చట్టాన్ని చేతిలోకి తీసుకుని ఓ మహిళా కండక్టర్‌ను తోసివేయడం వల్ల ఒక కుటుంబం రోడ్డున పడిందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కార్మికుల సంక్షేమానికి అనేక నిర్ణయాలు తీసుకున్నామని, సిబ్బందిలో అసహనం లేకుండా పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించడంతో సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ అనేది అత్యంత క్రమశిక్షణతో పనిచేసే ఖాకీ యూనిఫాం అని, ప్రయాణికులకు సౌకర్యాలు అందించే బాధ్యత తమదని స్పష్టం చేశారు. ప్రయాణికులే దేవుళ్లుగా భావించి సేవ చేయడం సిబ్బంది బాధ్యత అని చెబుతూనే, సిబ్బందికి ఏమైనా అసౌకర్యం కలిగితే వారు చట్టబద్ధంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. పోయిన సామాగ్రి దొరికితే తిరిగి అప్పగించేంత బాధ్యత గల సంస్థ ఆర్టీసీ అని మంత్రి పొన్నం కొనియాడారు. కార్మికుల భద్రత, ప్రయాణికుల సౌకర్యం తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చట్టపరిధిలోనే పరిష్కరించుకోవాలి తప్ప ఇలాంటి దాడులకు పాల్పడకూడదని కోరుతూ, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి పునరుద్ఘాటించారు.

దత్తత కేసులో ట్విస్ట్

ముద్ర, కరీంనగర్ :
జగిత్యాల జిల్లాలో తీవ్ర కలకలం రేపిన మూడేళ్ల బాలుడి చట్టబద్ధమైన దత్తత వ్యవహారంలో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించాలంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొట్టివేయాలని, విచారణ పూర్తయ్యే వరకు ఆ బాలుడిని తిరిగి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (CWC) సంరక్షణకు అప్పగించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ , సీడబ్ల్యూసీ అధికారులు ఉమ్మడిగా హైకోర్టును ఆశ్రయించారు.
సోషల్ మీడియా వీడియో వైరల్.. తల్లిదండ్రులకు అప్పగింత
చట్టబద్ధంగా దత్తత తీసుకోలేదన్న వివాదంతో అధికారుల నుంచి తమ మూడేళ్ల బాలుడిని విడదీయడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో బాలుడు ఏడుస్తున్న వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఆ తర్వాత తల్లిదండ్రులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అక్టోబర్ 16న హైకోర్టు ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వుల అమల్లో అధికారులు జాప్యం చేశారనే విమర్శలు కూడా వచ్చాయి.
హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని రిట్ పిటిషన్
తాజాగా హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ కలెక్టర్ సత్యప్రసాద్ , సీడబ్ల్యూసీ అధికారులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సీడబ్ల్యూసీ సమర్పించిన ఆధారాలు, నిబంధనలను పరిశీలించకుండానే గతంలో ఆ ఉత్తర్వులు ఇచ్చారని పిటిషన్‌లో వారు పేర్కొన్నారు. కేవలం హిందూ సంప్రదాయాల ప్రకారం జరిగిన దత్తతను చట్టపరమైన దత్తత ప్రక్రియగా పరిగణించవచ్చా అనే అంశంపై లోతుగా పరిశీలించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.
CWC సంరక్షణకే బాలుడిని అప్పగించాలని విజ్ఞప్తి
ఈ కేసుకు సంబంధించిన పూర్తి విచారణ సజావుగా సాగడానికి, ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు బాలుడిని తిరిగి సీడబ్ల్యూసీ కేంద్రానికే అప్పగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులు కోరారు. బాలుడిని తల్లిదండ్రుల వద్దే ఉంచాలంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై తక్షణమే స్టే విధించాలని జగిత్యాల కలెక్టర్ , సీడబ్ల్యూసీ అధికారులు పిటిషన్‌లో స్పష్టం చేశారు. దీంతో ఈ జగిత్యాల దత్తత వివాదంపై హైకోర్టు తదుపరి ఏ నిర్ణయం తీసుకోబోతుందనేది ఆసక్తికరంగా మారింది.

కరవు నుంచి రైతును గట్టెక్కించండి



ముద్ర, అమరావతి:
ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగం కుదేలైన నేపథ్యంలో, రైతులను, ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో కరవు తీవ్రతను అంచనా వేసేందుకు పర్యటించిన కేంద్ర అంతర మంత్రిత్వ శాఖల బృందం (ఐఎంసీటీ) బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలను సీఎం వారికి సమగ్రంగా వివరించారు.
రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను కేంద్ర బృందానికి వివరిస్తూ, "ఒకవైపు తీరప్రాంతం తుఫాన్లతో నష్టపోతుంటే, మరోవైపు రాయలసీమ, ఇతర ప్రాంతాలు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవు కోరల్లో చిక్కుకున్నాయి" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సాధారణం కంటే అత్యంత తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు.
ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశుగ్రాసానికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన ప్రాంతంగా అనంతపురం జిల్లా నిలిచిన విషయాన్ని ఆయన బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 412 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, పంట నష్టాలపై పూర్తి స్థాయి అంచనాలతో వారం రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.
కీలక పథకాల విస్తరణ
కరవు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధిని, వ్యవసాయాన్ని ఆదుకునేందుకు సీఎం కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి క్షేత్రస్థాయిలో మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో 'వీబీ జీ రామ్ జీ' పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని కోరారు. ఈ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించడం ద్వారా రైతులకు కూలీల కొరత తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సూచించారు.
కరవు కారణంగా రైతుల ఆదాయం పూర్తిగా పడిపోయిందని, గతంలో తీవ్ర కరవు వచ్చినప్పుడు రాయలసీమలో పది ఎకరాల రైతులకు కూడా రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకున్నామని గుర్తు చేశారు. అదే తరహాలో ప్రస్తుతం అర్హులైన కరవు బాధిత కుటుంబాలకు 'డ్రాట్ కార్డులు' జారీ చేసే అంశాన్ని పరిశీలించి, కేంద్ర సహకారంతో నిత్యావసరాలను సబ్సిడీపై అందించాలన్నారు. దీంతో పాటు, రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు కేంద్రం తోడ్పాటునందించాలని కోరారు.
జల్ జీవన్ మిషన్‌తో శాశ్వత పరిష్కారం
వర్షాభావంతో భూగర్భ జలమట్టాలు ప్రమాదకరంగా పడిపోయాయని, కొత్తగా ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడటం లేదని ముఖ్యమంత్రి తెలిపారు. కేవలం తాత్కాలిక నీటి సరఫరా చర్యలతో సరిపెట్టకుండా, శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇందుకోసం 'జల్ జీవన్ మిషన్' (జేజేఎం) పథకాన్ని మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానం వంటి పనులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు.
పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారాన్ని త్వరగా అందించడం అత్యవసరమని అన్నారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా, వీలైనంత త్వరగా పరిహారం రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది రైతులకు తదుపరి పంటకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని వివరించారు.
ఈ నెల 2, 3 తేదీల్లో కేంద్ర బృందం రెండు టీమ్‌లుగా విడిపోయి కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 5.11.2026
www.mudranews.in | @mudranews

చేతుల పరిశుభ్రత తప్పనిసరి!

బయటకు వెళ్లి వచ్చిన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో తిరిగినప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. చేతులతో తరచూ కళ్లు, ముక్కు, నోటిని తాకడం తగ్గించాలి.



మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు

రాష్ట్రవ్యాప్తంగ ఇందిరమ్మ ఇళ్లలో ఈ సారి దీపావళి వేడుకలు లబ్ధిదారులు,అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని పిలుపు
రాష్ట్రంలో 2,21,500 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పూర్తి
వివిధ నిర్మాణ దశల్లో 1.90 లక్షల ఇందిరమ్మ ఇళ్లు
4 కార్పొరేషన్లలో హైదరాబాద్ తరహా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం
రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంతవరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని ఈ దీపావళి రోజున ప్రతి ఇందిరమ్మ ఇంటిలో దీపావళి వేడుకలు జరపాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆరోజున పేదల ఇంట్లో వెలిగే ప్రతిదీపం తెలంగాణ ప్రజాప్రభుత్వ సంకల్పానికి ప్రతీక కావాలన్నారు. బుధవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మంత్రి పొంగులేటి మాట్లాడారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ ప్రజా ప్రభుత్వం ఎన్ని ఆర్థిక అవరోధాలున్నా పేదల ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించిందన్నారు. భద్రత, భరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్న సంకల్పంతో తొలివిడత 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటికి 2,21,500 ఇళ్లలో గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 1.90 లక్షల ఇళ్ళు వివిధ నిర్మాణదశల్లో పూర్తికానున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. గృహ ప్రవేశాలు జరుపుకున్న ఇళ్లకు దీపావళి రోజున ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ళ కమిటీ సభ్యులు, ఈ పథకంతో మమేకమైన అందరూ ఆ ఇళ్లకు వెళ్లి వారి ఆనందాల్లో భాగస్వాములు కావాలని కోరారు. దీనికి సూచికగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు అనే పోస్టర్‌ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో సహా రాష్ట్ర మంత్రి వర్గం ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని కోరుతోందని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తొలి విడతగా 4.50 లక్షల ఇళ్లు, రెండో విడత 2.50 లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో లక్ష ఇళ్లను మంజూరు చేశామని చెబుతూ హైదరాబాద్ తరహాలోనే రాష్ట్రంలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్‌లలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని ప్రకటించారు. జి+5 పద్ధతిలో నిర్మించనున్న ఈ టవర్స్ నిర్మాణానికి సంబంధించి దీపావళి లోగా నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని మంత్రి గారు పునరుద్ఘాటించారు.

రాష్ట్రంలో రూ.40 వేల కోట్లతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపేదిలేదని స్పష్టం చేస్తూ ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ప్రతి సోమవారం నేరుగా హైదరాబాద్ నుంచి అవినీతి రహితంగా నిధులను జమచేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు, గ్రామాలేగాక మారుమూల ప్రాంతాలు, తండాలలో కూడా ఈ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని ఫలితంగా పేదవారి సొంతింటికల సాకారమవుతోందని మంత్రి పొంగులేటి అన్నారు.

యువ ఆవిష్కర్తలకు కాకా గ్రోత్ ఫండ్ అండ

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణలోని యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాకా గ్రోత్ ఫండ్ (KGF) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా యువత తమ వినూత్న ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు రూ.5 లక్షల వరకు సీడ్ గ్రాంట్ పొందే అవకాశం కల్పించనున్నారు. కాకా నెక్స్ట్ జెన్ లీడర్స్ కార్యక్రమంలో ఎంపికైన మూడు విజేత బృందాలకు ఇప్పటికే రూ.2.25 లక్షల సీడ్ ఇన్వెస్ట్ మెంట్ అందించారు. ఇందులో ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు అందజేశారు. కాకా గ్రోత్ ఫండ్ ను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించి, గ్రామీణ యువతకు కూడా అవకాశాలు కల్పించనున్నట్లు ఎంపీ తెలిపారు. AI, వ్యవసాయం, పునరుత్పాదక ఇంధనం, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలకు ఆర్థిక సహకారంతో పాటు నిపుణుల మార్గదర్శకత్వం అందిస్తామన్నారు. యువత ఉద్యోగాలు వెతికేవారిగా కాకుండా, ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే: మంత్రి పొంగులేటి



ముద్ర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపడుతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి, రైతులకు వివాదరహిత భూములను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించి, భూ యజమానులకు ఆధార్ తరహాలో భద్రతతో కూడిన భూ రికార్డులు, పాస్‌బుక్కులు అందిస్తామని వెల్లడించారు. బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా భూ సర్వే, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. తొలుత ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడతగా సర్వే చేపడతామని తెలిపారు. సర్వే జరిగే గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని, కలెక్టర్లు కనీసం వారానికోసారి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని మంత్రి తెలిపారు. భూముల కొలతలు, సర్వే నంబర్లు, వాస్తవ స్వాధీన స్థితి మధ్య వ్యత్యాసాలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖరరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో నవంబర్ 7 నుంచి మెగా రైతు మేళా

ముద్ర, హైదరాబాద్ : రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు నవంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు కొడంగల్‌లో మెగా రైతు మేళా నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నవంబర్ 7న సీఎం రేవంత్ రెడ్డి మేళాను ప్రారంభించనున్నారు. 26 ప్రభుత్వ శాఖలు, సంస్థల భాగస్వామ్యంతో 150 ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, ప్రత్యామ్నాయ పంటలు, ఆధునిక సాగు విధానాలపై ప్రదర్శనలు, నిపుణుల సమావేశాలు నిర్వహించనున్నారు. రెండో రోజు మహిళా రైతులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. చివరి రోజు 10 జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరవుతారని అంచనా. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల అభిప్రాయాలు సేకరించండి

*** యూనిఫాంల రంగు, డిజైన్లపై ప్రత్యేక దృష్టి**
*** యూనిఫాం.. కిట్ల పంపిణీకి ఎస్ఓపీ రూపొందించండి**
*** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**



ముద్ర, హైదరాబాద్: విద్యార్థులకు అందించిన యూనిఫాంలపై వారి నుంచి అభిప్రాయాలు (ఫీడ్ బ్యాక్) సేకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల పరిధిలోని ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు, కిట్ల పంపిణీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. గతంతో పోలిస్తే ఎంతో నాణ్యమైన యూనిఫాంలు, ఆకర్షనీయమైన రంగులు, డిజైన్లతో అందజేశామన్నారు. అయితే, ఆయా రంగులు, డిజైన్లకు సంబంధించి విద్యార్థుల నుంచి అభిప్రాయాలు (ఫీడ్‌బ్యాక్) సేకరించాలన్నారు. అలా చేస్తే ఎక్కువ మంది విద్యార్థులు కోరుకునే రంగులు, డిజైన్లకు భవిష్యత్‌లో ప్రాధాన్యమివ్వచ్చని అన్నారు. యూనిఫాంలతో పాటు టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, షూలు, సాక్సులు, ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, కార్పెట్లు, స్కూల్ బ్యాగుల పంపిణీ దాదాపు పూర్తయిందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఒకట్రెండు సంస్థల పరిధిలో కొన్ని వస్తువుల పంపిణీ 95 శాతం వరకు పూర్తయిందని చెప్పారు. ఆ వస్తువుల పంపిణీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాదికి విద్యార్థులకు అందజేసే యూనిఫాంలు, ఇతర సామగ్రికి సంబంధించి విధి విధానాలను (ఎస్ఓపీ) రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విద్యార్థులకు అందజేసే వస్తువుల జాబితా రూపకల్పన, టెండర్లు , సరఫరా, అందజేత వరకు ప్రతిదీ నిర్దేశిత సమయంలో పూర్తవ్వాలని తెలిపారు. పాఠశాలలు తెరిచిన రోజునే మొత్తం వస్తువులు అందేలా ఇప్పటినుంచే కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, రాష్ట్ర గిరిజన, వెనుకబడిన తరగతుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, వివిధ శాఖల అధికారులు షఫీఉల్లా, బాలమాయాదేవి, విజయేందిర బోయి, దివ్య దేవరాజన్, జి.రవి, బి.సైదులు, బీఎం సంతోష్, నవీన్ నికొలస్, సీతా లక్షి పాల్గొన్నారు.

చక్రపాణి మృతిపై సీఎం రేవంత్ సంతాపం

ముద్ర, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్ డాక్టర్ ఏ. చక్రపాణి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శాసనమండలి పునరుద్ధరణ అనంతరం తొలి చైర్మన్‌గా ఆయన నిబద్ధతతో పనిచేశారని గుర్తుచేశారు. పార్లమెంటరీ సంప్రదాయాలను గౌరవిస్తూ నిష్పక్షపాతంగా వ్యవహరించారని కొనియాడారు. దాదాపు ఐదు దశాబ్దాల ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. చక్రపాణి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు 2.543 శాతం డీఏ పెంపు

ఉప ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన TGPEJAC నేతలు
19.272 నుంచి 21.815 శాతానికి పెరిగిన కరువు భత్యం
జూలై 2026 నుంచి డీఏ పెంపు అమలు
PRC–2026 వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులకు 2.543 శాతం కరువు భత్యం (డీఏ) పెంపును ప్రభుత్వం మంజూరు చేసింది. 2026 జూలై నుంచి అమల్లోకి వచ్చే ఈ పెంపుతో ఉద్యోగుల డీఏ 19.272 శాతం నుంచి 21.815 శాతానికి చేరింది. ఈ నిర్ణయంపై తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (TGPEJAC) నాయకులు ఉప ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి PRC–2026 వేతన సవరణ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగి గరిష్ఠంగా 20,018 మెగావాట్లకు పైగా నమోదైనప్పటికీ, TGTRANSCO, TGGENCO, TGDISCOMs సంస్థల ఇంజనీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్లు సమష్టి కృషితో నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతులు, గృహ వినియోగదారులు, పారిశ్రామిక సంస్థలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఉద్యోగుల సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్ర విద్యుత్ రంగ అభివృద్ధికి, ప్రజలకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ఉద్యోగులు చేస్తున్న కృషి ఎంతో విలువైనదని TGPEJAC నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో TGPEJAC కన్వీనర్ రత్నాకర్ రావు, సెక్రటరీ జనరల్ శ్రీధర్, 1104 అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ వజీర్, సదానందం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా రంగ అభివృద్ధికి రూ.800 కోట్లు

ఎల్బీ స్టేడియంలో ఆధునీకరించిన టెన్నిస్ కాంప్లెక్స్ ప్రారంభం



ముద్ర, హైదరాబాద్: తెలంగాణను దేశంలోనే ప్రముఖ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఆధునీకరించిన టెన్నిస్ కాంప్లెక్స్‌ను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ, గతంలో నిరుపయోగంగా ఉన్న స్టేడియాలను పునరుద్ధరించి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ బాధ్యతలు తెలంగాణకు దక్కడం గర్వకారణమని, పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ స్కూల్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీస్తామని పేర్కొన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడా రంగ అభివృద్ధికి ప్రభుత్వం రూ.800 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఆర్థిక సహాయంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో రాణించ డానికి ఆర్థిక స్థోమత కంటే ప్రతిభ, నైపుణ్యం, కృషి, పట్టుదల ముఖ్యమని పేర్కొన్నారు. క్రీడా ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి మెరుగైన శిక్షణ అందించాలని కోరారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించేలా ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని మంత్రులు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య వ్యతిరేక పోటీలు విజయవంతం

వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్ కళాశాల స్థాయిలో విద్యార్థులకు నిర్వహణ



ముద్ర, హైదరాబాద్: వాసవి ఇంజినీరింగ్ కళాశాల, హైదరాబాద్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు అంతర్ కళాశాల స్థాయి మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన , నివారణ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని మూడు పోటీలకు మొత్తం 25 కళాశాలల నుండి 194 students పాల్గొనేవారు నమోదు చేసుకున్నారు. తొమ్మిది జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. విజేతలకు నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్స్, పతకాలు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈగల్ ఫోర్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (SP) శ్రీ పి. సీతారాం హాజరయ్యారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, వాటిని నివారించే మార్గాల గురించి ఆయన వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.

ఈగల్ ఫోర్స్ నుంచి OSD శ్రీ కృష్ణమూర్తి, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాసవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. వి. రమణ, కార్యదర్శి శ్రీ పార్థసారథి, కోశాధికారి శ్రీ ఆనంద్ కుమార్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

ఈ కార్యక్రమాన్ని NSS Program ఆఫీసర్లు డా. పి. వి. రావు, డా. ఎం. రవి కుమార్ మరియు వాలంటీర్లు కలిసి నిర్వహించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
గురువారం, 05 నవంబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

సమానత్వాల సమాహారం!

కార్తీక మాసం.. భక్తి.. ప్రకృతి.. ఆరోగ్యం.. విజ్ఞానం



భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో కార్తీక మాసానికి విశిష్ట స్థానం ఉంది. పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన మాసంగా భావించే ఈ కాలం భక్తి పారవశ్యంతోపాటు ఆరోగ్య స్పృహ, ప్రకృతి పరిరక్షణ, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. దీపారాధనలు, తెల్లవారుజామున స్నానాలు, ఉపవాసాలు, మాలధారణలు, భిక్షాటనలు, వనభోజనాలు.. ఇలా ప్రతి ఆచారం వెనుక ఓ జీవన సందేశం దాగి ఉంది. వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార నియంత్రణ, క్రమశిక్షణ, ప్రకృతితో సహజీవనం, పరస్పర సహకారం వంటి విలువలను ఈ మాసం గుర్తు చేస్తుంది. ముఖ్యంగా కులమతాలు, ప్రాంతాలు, ఆర్థిక అంతరాలకు అతీతంగా మనుషులంతా సమానమేననే మానవీయ సందేశాన్ని అందిస్తుంది. సంప్రదాయాల వెనుక ఉన్న అంతరార్థాన్ని ఆధునిక విజ్ఞానంతో అనుసంధానించుకుంటే కార్తీక మాసం విశిష్టత మరింతగా అవగతమవుతుంది. 2026లో తెలుగు పంచాంగం ప్రకారం కార్తీక మాసం నవంబర్ 9న ప్రారంభమై, డిసెంబర్ 8న ముగుస్తుంది.

గడుగోజు రవీంద్రచారి
జర్నలిస్ట్, 9848772232



వెలుగుల వెనుక విజ్ఞానం!

కార్తీక మాసంలో దీపారాధనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇంటి ముంగిట, తులసి కోట వద్ద, దేవాలయాల్లో ఆవు నెయ్యి, నువ్వుల నూనెతో దీపాలు వెలిగించడం ఆనవాయితీ. దీపం కేవలం చీకటిని తొలగించే సాధనం మాత్రమే కాదు.. మనిషి జీవితానికి ఓ గొప్ప తాత్విక సందేశం. చీకటి నుంచి వెలుగులోకి, అజ్ఞానం నుంచి విజ్ఞానంలోకి, అపోహల నుంచి వాస్తవాల వైపు పయనించాలనే స్ఫూర్తినిస్తుంది. వత్తి తనను తాను కాల్చుకుంటూ ఇతరులకు వెలుగునిచ్చినట్లే మనిషి కూడా సమాజానికి ఉపయోగపడాలనే అంతరార్థం ఇందులో ఉంది. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే శాస్త్రీయ అవగాహనతో ఆచరించాలి.

ఉసిరి చెట్టు.. ఆరోగ్య సంపద!

కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకు విశేష ప్రాధాన్యం ఉంది. ఉసిరిని లక్ష్మీదేవి, విష్ణుమూర్తి స్వరూపంగా భావించి పూజిస్తారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించడం, దాని నీడలో వనభోజనాలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఉసిరికాయలో విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి సమతుల్య ఆహారంలో భాగంగా ఆరోగ్యానికి తోడ్పడతాయి. చెట్లు కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయి. ఉసిరి చెట్టును ఆరాధించడం వెనుక ప్రకృతిని గౌరవించాలనే సందేశం ఉంది. అయితే దీపాలు వెలిగించేటప్పుడు మంటలు అంటుకోకుండా జాగ్రత్త తీసుకోవాలి.

తెల్లవారుజామున స్నానం..

కార్తీక మాసంలో వేకువజామునే నిద్రలేచి బావుల వద్ద, ఇళ్లలో, దేవాలయాల్లో వసతిని బట్టి స్నానాలు చేయడం సంప్రదాయం. చలికాలంలోనూ ఉదయాన్నే నిద్రలేవడం వల్ల సమయపాలన, క్రమశిక్షణ అలవడతాయి. స్నానం శరీరంపై పేరుకుపోయిన మలినాలను తొలగించి పరిశుభ్రతను, తాజాదనాన్ని అందిస్తుంది. ఉదయపు ప్రశాంత వాతావరణంలో గడపడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, మనసు ప్రశాంతంగా ఉంటుంది. నడక, ధ్యానం వంటి అలవాట్లు శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ప్రశాంతమైన మనసుతో రోజును ప్రారంభించడం వల్ల ఆలోచనల్లో స్పష్టత, పనులపై ఏకాగ్రత పెరుగుతాయి. భక్తితోపాటు పరిశుభ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతతను అలవర్చుకోవడమే ఈ సంప్రదాయం వెనుక ఉన్న ఆరోగ్య సూత్రం. అయితే చలిస్నానాలు అందరికీ అనుకూలించవు కాబట్టి ఆరోగ్య పరిస్థితిని బట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఉపవాసం.. ఆహార నియంత్రణ!

కార్తీక మాసంలో చాలామంది మాంసాహారానికి దూరంగా ఉంటూ శాకాహారాన్ని స్వీకరిస్తారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలకు ప్రాధాన్యమిస్తారు. ముఖ్యంగా సోమవారాల్లో ఉపవాసం ఆచరించడం శివభక్తుల ఆనవాయితీ. మితాహారం, ఆహార నియంత్రణ, పోషక విలువలున్న పదార్థాల వినియోగం ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయి. పీచు పదార్థాలు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే శాకాహారం జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. అయితే మధుమేహం వంటి సమస్యలున్న వారు వైద్యుల సలహా మేరకు ఉపవాస నియమాలు పాటించాలి. ఉపవాసం అంటే ఆకలితో ఉండటం మాత్రమే కాదు.. ఆహారంపై నియంత్రణ, మనసుపై నిగ్రహం కలిగి ఉండటం.

మాలధారణ.. క్రమశిక్షణకు కవచం!

కార్తీక మాసంలో అయ్యప్ప, భవానీ, శివ, ఆంజనేయ మాలధారణలు విస్తృతంగా కనిపిస్తాయి. భక్తులు కఠిన నియమనిష్ఠలతో దీక్ష కొనసాగిస్తారు. సాత్విక ఆహారం తీసుకోవడం, నిత్యపూజలు, భజనలు చేయడం, మద్యపానం, ధూమపానాలకు దూరంగా ఉండటం వంటి నియమాలను పాటిస్తారు. ప్రతిరోజూ స్నానం చేయడం, నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అలవాట్లకు ప్రాధాన్యమిస్తారు. మాలధారణ సమయంలో భక్తులతోపాటు కుటుంబ సభ్యులు కూడా సాత్విక జీవనశైలిని అనుసరిస్తారు. తాజాగా వండిన ఆహారం తీసుకోవడం, శుభ్రమైన పాత్రలు ఉపయోగించడం వంటి జాగ్రత్తలు పాటిస్తారు. ఈ అలవాట్లు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడతాయి. దీక్ష అనేది కేవలం మాల ధరించడం మాత్రమే కాదు.. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ శరీరంతోపాటు మనసును పరిశుద్ధంగా ఉంచుకోవడం.

భిక్షాటన.. సమానత్వానికి చిరునామా!

దీక్షలో ఉన్న స్వాములు ఇళ్లకు వెళ్లి భిక్ష స్వీకరించడం వెనుక గొప్ప మానవీయ సందేశం ఉంది. గృహస్థులు భక్తితో స్వాములను ఆహ్వానించి అన్నదానం చేస్తారు. ఇక్కడ ధనిక, పేద అనే తేడా ఉండదు. కులం, మతం, ప్రాంతం, సామాజిక హోదాతో సంబంధం లేకుండా అతిథ్యానికి ప్రాధాన్యం లభిస్తుంది. ఒకరి ఇంటికి మరొకరు వెళ్లడం, ఆప్యాయంగా పలకరించుకోవడం, కలిసి భోజనం చేయడం ద్వారా మానవ సంబంధాలు బలపడతాయి. ఇచ్చేవారిలో దాతృత్వం, స్వీకరించేవారిలో వినయం పెంపొందుతాయి. భిక్ష అంటే కేవలం ఆహారం అందించడం కాదు.. మనుషుల మధ్య ఆప్యాయతను పంచుకోవడం. ఒకరి ఆకలిని మరొకరు గుర్తించే మానవత్వాన్ని చాటడం. ఆర్థిక అసమానతలు, కులమత భేదాలు మనుషుల మధ్య గోడలుగా నిలవకూడదనే సందేశాన్ని ఈ సంప్రదాయం అందిస్తుంది.

ప్రకృతి ఒడిలో ఆత్మీయతల విందు!

కార్తీక మాసంలో వనభోజనాలకు విశేష ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉసిరి చెట్టు వద్ద లేదా పచ్చని వృక్షాల నీడలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు కలిసి భోజనాలు చేస్తారు. ఎవరి స్థాయికి తగ్గట్టుగా వారు ఆహార పదార్థాలు తీసుకొచ్చి అందరితో పంచుకుంటారు. అందరూ ఒకే వరుసలో కూర్చుని భోజనం చేయడం, పరస్పరం వడ్డించుకోవడం ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తాయి. అరటి ఆకులు, పచ్చని విస్తళ్లపై భోజనం చేయడం సంప్రదాయంలో భాగం. అరిటాకులో భోజనం వడ్డించడం ప్రకృతితో అనుబంధాన్ని గుర్తుచేయడమే కాకుండా సహజ పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది. ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా ఆకులను ఉపయోగించడం పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుంది. వనభోజనాల్లో ధనిక, పేద అనే తేడా ఉండదు. కులమత భేదాలకు తావుండదు. ఒకరి ఇంటి వంట కాలను మరొకరు పంచుకుంటూ, కలిసి భోజనం చేస్తూ ఆత్మీయతను పెంపొందించుకుంటారు. తరతరాల మధ్య బంధుత్వాలు, అనుబంధాలు బలపడతాయి.

అనుబంధాల్లో ఆనందం!

కార్తీక మాసంలోని ప్రతి ఆచారంలోనూ ఓ జీవన సందేశం ఉంది. దీపారాధన వెలుగును, ఉసిరి ఆరాధన ప్రకృతి పరిరక్షణను, తెల్లవారుజామున స్నానం పరిశుభ్రతను, ఉపవాసం ఆహార నియంత్రణను, మాలధారణ క్రమశిక్షణను, భిక్ష దాతృత్వాన్ని, వనభోజనాలు సామాజిక సమానత్వాన్ని చాటి చెబుతాయి. ఇవన్నీ ఆరోగ్యకరమైన జీవన విధానానికి, ఆత్మీయ సంబంధాల పెంపునకు దోహదపడతాయి. నేటి ఆధునిక జీవన శైలిలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల మధ్య ఆత్మీయతలు తగ్గుతున్న తరుణంలో కార్తీక మాసపు సామూహిక సంప్రదాయాలు మనుషులను దగ్గర చేస్తాయి. దేవాలయాల్లో దీపాలు వెలిగించడం ఎంత ముఖ్యమో.. మనసుల్లో మానవత్వపు వెలుగులు నింపడం అంతకంటే ముఖ్యం. సంప్రదాయాలను మూఢంగా కాకుండా వాటి వెనుక ఉన్న మంచి విలువలను గుర్తించి ఆచరించాలి. భక్తితో మనసు పవిత్రం కావాలి.. విజ్ఞానంతో ఆలోచన వికసించాలి.. సమానత్వంతో సమాజం వెలుగొందాలి.. ప్రకృతితో మానవ మనుగడ పరిఢవిల్లాలి!



వేడి వేడి అన్నంలో నెయ్యి

ప్రయోజనాలెన్నో!

వేడి వేడి అన్నం మీద ఒక స్పూన్ నెయ్యి వేసుకుని కలుపుకుని తింటే ఆ తృప్తే వేరు. దక్షిణ భారతదేశంలో నెయ్యి అన్నం చేసుకుని తింటారు. వేడి అన్నంలో నెయ్యి, చిటికెడు ఉప్పు వేసుకుని కలుపుకుని తింటే రుచి అదిరిపోతుంది. ఉత్తర భారతదేశంలో పప్పు-అన్నం మొదటి ముద్దలో నెయ్యి కలుపుకుని తినడం వరకు.. ఈ అలవాటు తరతరాలుగా వస్తోంది. నెయ్యిని తినడం కేవలం ఒక ఆహారపు అలవాటు మాత్రమే కాదు..

ఇది ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. బ్యాలెన్స్‌డ్ డైట్‌లో భాగంగా వేడి అన్నంలో కాస్త నెయ్యి కలుపుకుని తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పోషకాలను శరీరం బాగా గ్రహిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్ చేయడంతో పాటు గట్ హెల్త్‌ను కాపాడటంలో నెయ్యి అద్భుతంగా పనిచేస్తుంది.

కార్బోహైడ్రేట్ల శోషణ వేగాన్ని తగ్గిస్తుంది

తెల్ల అన్నంలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండటంతో పాటు దాని గ్లైసెమిక్ ఇండెక్స్ (Glycaemic Index) కూడా ఎక్కువే. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరిగే అవకాశం ఉంది. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారానికి కొవ్వు తోడైనప్పుడు, జీర్ణాశయం నుంచి ఆహారం బయటకు వెళ్లే వేగం (gastric emptying) తగ్గుతుంది. ఫలితంగా గ్లూకోజ్ రక్తంలో వెంటనే కలవకుండా నెమ్మదిగా చేరుతుంది. రీసెర్చ్‌గేట్ (ResearchGate) లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, 103 మంది టైప్-2 డయాబెటిస్ రోగులకు 3 నెలల పాటు నెయ్యితో వండిన తెల్ల అన్నం పెట్టారు. ఈ డైట్ మార్పుకు ముందు, తర్వాత వారి HbA1c స్థాయిలను పరీక్షించారు. ఇందులో 86.41% మంది రోగులలో HbA1c స్థాయిలు తగ్గినట్లు గుర్తించారు. కేవలం 13.59% మందికి మాత్రమే పెరిగింది.

పరిశోధకుల ప్రకారం, నెయ్యితో వండిన తెల్ల అన్నం రోగుల రక్తంలో చక్కెర స్థాయిలను పెంచలేదు. నెయ్యి మ్యాజిక్ చేసే మందు కాకపోయినా, వట్టి అన్నం తినడం కంటే కాస్త నెయ్యి కలుపుకుని తినడం వల్ల శరీరానికి స్థిరమైన శక్తి అందుతుంది.

శరీరానికి మేలు చేసే ఫ్యాటీ యాసిడ్స్

నెయ్యిలో సంతృప్త కొవ్వు (saturated fat) ఎక్కువగా ఉన్నప్పటికీ, బ్యూట్రిక్ యాసిడ్ (butyric acid) లాంటి షార్ట్-చైన్, మీడియం-చైన్ ఫ్యాటీ యాసిడ్స్ సహజంగానే పుష్కలంగా ఉంటాయి. పెద్దప్రేగు లోపలి కణాలకు అవసరమైన ముఖ్యమైన శక్తిని బ్యూట్రేట్ ఇస్తుంది కాబట్టి, సైన్స్ ప్రపంచం దీనిపై ఎక్కువ దృష్టి పెడుతోంది. 'హెల్త్ బెనిఫిట్స్ ఆఫ్ ఘీ: రివ్యూ ఆఫ్ ఆయుర్వేద అండ్ మోడ్రన్ సైన్స్ పర్స్‌పెక్టివ్స్' అనే అధ్యయనం ప్రకారం, నెయ్యిలోని ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్లు, బయో-యాక్టివ్ సమ్మేళనాలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.

జ్ఞాపకశక్తి, జీర్ణక్రియ, పోషణ, ఉత్సాహానికి నెయ్యి సహాయపడుతుందని ఆయుర్వేదం చెబుతోంది. గుండె ఆరోగ్యం, గాయాలు మానడం, చర్మ ఆరోగ్యంపై నెయ్యి ప్రభావాన్ని ఆధునిక పరిశోధనలు విశ్లేషించాయి. నెయ్యిలోని ప్రత్యేకమైన ఫ్యాటీ యాసిడ్స్ వల్ల వైద్యపరమైన ప్రయోజనాలు ఉండొచ్చని అధ్యయనాలు సూచిస్తున్నా, దీనిపై ఇంకా పరిశోధనలు జరగాల్సి ఉంది. ఒక స్పూన్ నెయ్యిలో బ్యూట్రేట్ పరిమాణం తక్కువే కాబట్టి, దీన్ని పూర్తి వైద్య చికిత్సగా పరిగణించలేం. కానీ, పాల కొవ్వుల పోషక విలువలను ఇది ఎన్నో రెట్లు పెంచుతుంది.

వేడి నీరు తాగితే

బరువు తగ్గుతారా

హెల్దీ లైఫ్‌స్టైల్‌లో నీరు తాగడం కీలక పోషిస్తుంది. దీని వల్ల చాలా బెనిఫిట్స్ ఉంటాయి. ముఖ్యంగా వెయిట్‌లాస్ జర్నీలో నీరు తాగడమనేది చాలా ముఖ్యం. దీని వల్ల మన బాడీలో పేరుకుపోయిన ట్యాక్సిన్స్ దూరమవ్వడమే కాకుండా ఆరోగ్యానికి మేలు జరిగి బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తాయి. అయితే, ఇందులోనూ వేడి నీరు, చల్ల నీరు ఏ తాగాలనే సందేహం చాలా మందికే ఉంటుంది. ఎక్కువగా గోరువెచ్చని నీరు తాగితే బరువు తగ్గడానికి ఎక్కువగా హెల్ప్ చేస్తుందని చెబుతుంటారు. కానీ, చల్లని నీరు బరువు తగ్గించడంలో అంతకు మించి మేలు చేస్తుందని చెబుతున్నారు న్యూట్రిషనిస్ట్ అషిమా. దానికి గల కారణాలు కూడా చెబుతున్నారు.

బరువు తగ్గడానికి చల్లని నీరు

చల్లని నీరు తాగితే జీవక్రియ కొద్దిగా పెరుగుతుంది. ఎందుకంటే మన బాడీ వేడెక్కడానికి కేలరీలు బర్న్ అవుతాయి. అంతేకాకుండా, సాధారణ హైడ్రేషన్ కూడా బెనిఫిట్స్ ఉంటాయి. చల్లని నీరు తాగితే ఆకలి తగ్గుతుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది. వర్కౌట్ చేయడానికి హెల్ప్ చేస్తుంది. దీని వల్ల సరైన ఆహారం, వర్కౌట్ రొటీన్‌కి హెల్ప్ అవుతుంది. అంతేకానీ, వాటికి ఆల్టర్నేటివ్ అయితే కాదు. చల్లని నీరు తాగుతూ సరైన డైట్ మెంటెయిన్ చేసి వర్కౌట్ చేస్తే త్వరగా రిజల్ట్ ఉంటుంది.

కడుపు నిండుగా అనిపించడం

మనకి ఎప్పుడైనా ఆకలిగా అనిపించినప్పుడు చల్లని నీరు తాగి చూడండి. అప్పటికప్పుడు కడుపు నిండుగా అనిపిస్తుంది. దీంతో ఆకలి చాలా వరకూ తగ్గుతుంది. వెంటనే తినాల్సిన పని లేదు. ఈ కారణంగా బరువు తగ్గడానికి హెల్ప్ అవుతుంది. అదే గోరువెచ్చని నీరు తాగితే త్వరగా ఆకలి అయినట్లుగా అనిపిస్తుంది. దీనికి కారణం లోపలి ఆహారాన్ని త్వరగా జీర్ణమవుతుంది. అందుకే, చల్లని నీరు తాగడం చాలా ముఖ్యం.

చల్లని నీటితో ఎక్కువ కేలరీలు బర్న్

చల్లని నీరు తాగడం వల్ల మనం రోజువారీ బర్న్ చేసే కేలరీలు పెరుగుతాయి. ఎందుకంటే మన బాడీ ఉష్ణోగ్రతకి వేడి చేయడానికి శక్తి ఖర్చు అవుతుంది. దీనినే థర్మోజెనిసిస్ ప్రాసెస్ అంటారు. ఇలా నీరు తాగడం వల్ల కేలరీలు ఎక్కువగా కరుగుతాయి. బరువు తగ్గుతారు. సరైన హైడ్రేషన్, బ్యాలెన్స్డ్ ఫుడ్ చాలా ముఖ్యమైనవి. చల్లని నీరు తాగితే కేలరీలు ఎక్కువగా కరుగుతాయి. అయితే, జీవక్రియలో పెరుగుదల కాస్తా తక్కువగానే ఉంటుంది. ఇది మనం సరైన ఫుడ్, వర్కౌట్‌తో బ్యాలెన్స్ చేయొచ్చు.

వర్కౌట్ చేసినప్పుడు చల్లని నీరు తాగితే

మనం ఎక్సర్‌సైజ్ చేసినప్పుడు చల్లని నీరు తాగితే ఆ టెంపరేచర్ బాడీ టెంపరేచర్‌ని కంట్రోల్ చేస్తుంది. దీంతో ఎక్కువసేపు వర్కౌట్ చేయడానికి హెల్ప్ చేస్తుంది. కాస్తా తృప్తిగా ఉంటుంది. అదే వేడిలో గోరువెచ్చని నీరు తాగితే అసలు తాగినట్లుగా కూడా ఉండదు. మళ్లీ మళ్లీ దాహం వేస్తుంది. ఎక్కువగా తాగితే హెవీగా అనిపిస్తుంది.

మొత్తంగా న్యూట్రిషనిస్ట్ ప్రకారం

మొత్తంగా న్యూట్రిషనిస్ట్ ప్రకారం, వేడి నీరు కంటే చల్లని నీరు తాగడం వల్ల త్వరగా బరువు తగ్గుతారు. బాడీలోని కేలరీలు తగ్గడానికి, కడుపుకి తృప్తిగా అనిపించి ఆహారం తక్కువగా తీసుకోవడానికి హెల్ప్ చేస్తుంది. ఈ కారణంగా బరువు తగ్గుతారు. అయితే, అలా అని గోరువెచ్చని నీరు మంచిది కాక పోవడమంటూ లేదు. గోరువెచ్చని నీరు మనకి జీర్ణ సమస్యలు రాకుండా చేస్తుంది. అయితే, బరువు తగ్గించడంలో మాత్రం గోరువెచ్చని నీరు కంటే చల్లని నీరు కొద్దిగా ఎక్కువగా హెల్ప్ చేస్తుందని న్యూట్రిషనిస్ట్ చెబుతున్నారు.





ముక్కు దిబ్బడ, గొంతు గరగరకు చిట్కా

గోరువెచ్చగా ఉండే పానీయాలు గొంతు మంటను తగ్గించి, తేమను అందిస్తాయి. ముక్కులోని కఫాన్ని కరిగించి శ్వాస సులభంగా అడేలా చేస్తాయి. వేడి నీరు, అల్లం టీ, పసుపు పాలు, కూరగాయల సూప్స్, మిరియాల రసం, చికెన్ బ్రాత్, తేనె – నిమ్మకాయ నీళ్లు మంచి ఫలితాన్నిస్తాయి.

తేనె, నిమ్మకాయ కలిపిన గోరువెచ్చని నీరు: శరీరానికి తేమను అందిస్తుంది. తేనె గొంతులో పూతలా ఏర్పడి గరగరను తగ్గిస్తుంది. నిమ్మకాయలోని విటమిన్-సి రోగ నిరోధక శక్తికి మేలు చేస్తుంది. ఏడాదిలోపు పిల్లలకు తేనె అస్సలు ఇవ్వకూడదు.

అల్లం టీ: అల్లంలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ గుణాలు సైనస్ ఒత్తిడిని, గొంతు వాపును తగ్గిస్తాయి.

చికెన్ సూప్ లేదా వెజిటబుల్ బ్రాత్: శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లు, ప్రొటీన్లను అందిస్తాయి. సూప్ తాగేటప్పుడు వచ్చే ఆవిరి ముక్కు రంధ్రాల్ని తెరిచేలా చేస్తుంది.

హెర్బల్ టీలు (చామంతి, పుదీనా, యష్టిమధుకం): ఇవి గొంతు కణజాలాలకు ఉపశమనాన్నిచ్చి, మంటను తగ్గిస్తాయి.

పసుపు, మిరియాల పాలు: గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు, మిరియాల పొడి కలిపి తాగితే గొంతు నొప్పి తగ్గి, శ్వాసకోశ వాపు తగ్గుతుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 04.11.2026
www.mudranews.in | @mudranews

గదుల్లోకి స్వచ్ఛమైన గాలి వచ్చేలా చూడండి



చలి పెరిగిందని కిటికీలను రోజంతా మూసి ఉంచకూడదు. గాలి ప్రసరణ లేకపోతే గదుల్లో వైరస్‌లు వ్యాపించే అవకాశం ఉంటుంది. సాధ్యమైనప్పుడు కిటికీలు తెరిచి స్వచ్ఛమైన గాలి వచ్చేలా చూసుకోవాలి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో
సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ఆసుపత్రికి ఎంతమంది రోగులు ఓపీ సేవల కోసం వస్తున్నారని ఆరా తీశారు, ఓపీకి వచ్చిన రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా, వారందరికీ అభా (ఏ బి హెచ్ ఏ) రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారా అనే విషయాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యాధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందించాలి

:విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. బుధవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని మైనారిటీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించి, పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, వసతి సౌకర్యాలు, భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు, ఎంత మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా హాజరవుతున్నారా అనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించి, పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, వసతి సౌకర్యాలు, భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు, ఎంత మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా హాజరవుతున్నారా అనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యాధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కరువు పరిస్థితుల్లో రైతులకు బ్యాంకుల సహకారం అవసరం

ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో ఈ ఏడాది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకులు రైతులకు రుణాల ద్వారా అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, సూచించారు.బుధవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బ్యాంకర్లతో ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 17 మండలాలను ప్రభుత్వం కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో రైతులకు ఆర్థిక ఉపశమనం కల్పించడం, వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ, కొత్త పంట రుణాల మంజూరు తదితర అంశాలపై బ్యాంకు అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కరువు పరిస్థితుల కారణంగా పంట దిగుబడులు తగ్గడంతో పాటు సాగునీటి కొరత వల్ల పలువురు రైతులు పంట నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అర్హులైన రైతులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI), రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (SLBC) మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ ద్వారా ఉపశమనం కల్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.అర్హత కలిగిన రైతులకు నిబంధనల ప్రకారం 12 నెలల మారటోరియం కల్పించడంతో పాటు, రుణాల తిరిగి చెల్లింపు వ్యవధిని గరిష్ఠంగా 24 నుంచి 60 నెలల వరకు పొడిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.దీని మీద స్పష్టమైన మార్గదర్శకాలు త్వరలో బ్యాంకులకు అందుతాయని పేర్కొన్నారు.అర్హత కలిగిన స్వల్పకాలిక పంట రుణాలను వడ్డీతో సహా మధ్యకాలిక రుణాలుగా మార్చే ప్రక్రియను చేపట్టాలని, మారటోరియం అనంతరం నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రుణాల చెల్లింపులు జరిగేలా చూడాలని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్రాంరెడ్డి , డీ.ఆర్.డీ.ఓ నాగిరెడ్డి ,పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీధర్,ఆర్.బీ.ఐ ఏ.జీ.ఎం హేమలత,లీడ్ బ్యాంకు మేనేజర్ వీరన్న ,నాబార్డ్ డీడీఎం ధూన్సీ రాణి కాసర్ల ,వివిధ బ్యాంకుల అధికారులు , పాల్గొన్నారు.

రాఘవాపురం, రుద్రవెల్లి, పల్లెగూడెం గ్రామాలకు అదనపు బస్సు సౌకర్యం



ముద్ర, బీబీనగర్: బీబీనగర్ మండలం రాఘవాపురం, రుద్రవెల్లి, పల్లెగూడెం గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగుల రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సు సౌకర్యం కల్పించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి బీబీనగర్ పీఏసీఎస్ చైర్మన్ పొట్టోల శ్యామ్ గౌడ్, రాఘవాపురం సర్పంచ్ సిద్ధగోని శ్రీకాంత్ గౌడ్, రుద్రవెల్లి సర్పంచ్ జిలకపల్లి సరళ అశోక్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయా గ్రామాల నుంచి ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు విద్య, ఉద్యోగ, ఇతర పనుల నిమిత్తం మండల కేంద్రంతో పాటు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నారని, అయితే సరైన సమయాల్లో బస్సులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించి ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి అదనపు బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం చెంగిచెర్ల డిపోకు చెందిన సికింద్రాబాద్–రాఘవాపురం బస్సుకు రాఘవాపురం గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు బస్సులో ప్రయాణించారు. ప్రజల సమస్యలను గుర్తించి సకాలంలో స్పందించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదనపు బస్సు సౌకర్యంతో ఆయా గ్రామాల ప్రజలకు రవాణా ఇబ్బందులు తగ్గనున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రక్తని కృష్ణ, రుద్రవెల్లి ఉప సర్పంచ్ చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేకల కుమారస్వామి, అమనగంటి వెంకటేష్, వార్డు సభ్యులు తొర్పునూరి రవికుమార్, నేలపట్ల అజయ్, కొమ్ము మంగమ్మ, కరిషక మధుబాల, నవీన్ గౌడ్, సుర్వీ బాల్ రెడ్డి, కొత్త యాదగిరి, కాటం శోభ, గ్యార అలివేలు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి పరిహారం అందించాలి



మాజీ ఎమ్మెల్యే సండ్ర

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 4 : సత్తుపల్లి నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాలు, మురుసు తుఫాను ప్రభావం కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం చెల్లించాలని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య విజ్ఞప్తి చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 200 మిల్లీమీటర్లకు పైగా భారీ వర్షపాతం నమోదైందని, రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో ఇది ఒకటిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ వర్షాల వల్ల నియోజకవర్గ వ్యాప్తంగా అపారమైన పంట నష్టం వాటిల్లిందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.నియోజకవర్గంలో ప్రధానంగా సాగవుతున్న వరి పంట ప్రస్తుతం కోత దశకు వచ్చిందని, ఈ తరుణంలో కురిసిన భారీ వర్షాలకు పొలాలు నీటమునిగి పైరు పూర్తిగా వంగిపోయిందని తెలిపారు. చేతికి అందాల్సిన పంట నీటిపాలు కావడమే కాకుండా పొలాల్లో నడుములోతు నీరు నిలిచిపోయిందన్నారు. ఇప్పటికే ఎల్ నినో ప్రభావంతో కష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఈ తుఫాను మరింత కోలుకోలేని దెబ్బతీసిందని వాపోయారు. అలాగే తీత దశలో ఉన్న పత్తి పంట కూడా వర్షపు నీటిలో తడిచి ముద్దయి దిగుబడి పూర్తిగా దెబ్బతిందని సండ్ర వివరించారు.వ్యవసాయ శాఖ యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై నియోజకవర్గంలో వరితో పాటు ఇతర పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి క్షేత్రస్థాయి సర్వేలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంబంధిత సర్వే నివేదికలను ప్రభుత్వానికి పంపి సత్తుపల్లి నియోజకవర్గాన్ని పంట నష్ట ప్రాంతంగా ప్రకటించాలన్నారు. తీవ్రంగా నష్టపోయి కన్నీరు మున్నీరవుతున్న అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుని, బాధిత ప్రతి రైతుకూ తగిన పంట నష్ట పరిహారాన్ని విడుదల చేసి ఆదుకోవాలని కోరారు.

ఎస్ఐఆర్ రద్దు, కరువు సహాయక చర్యల కోసం పోరాటం

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబర్ 4: ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో 13 కోట్ల మంది ఓట్లు రద్దయ్యాయని, వీటిలో వ్యవసాయ కూలీ లు, దళితులు, వలస కార్మికులు, ముస్లిం లు అధికంగా ఉన్నారని ఆరోపించారు. రద్దయిన ఓట్లను పునరుద్ధరించాలని కోరారు. దేశంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, కరువు సహాయక చర్యల కోసం రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎరువుల సబ్సిడీ తగ్గింపు, నిత్యావసర ధరల పెరుగుదలతో రైతులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఎఫ్‌సీఐ వద్ద ఉన్న ధాన్యం నిల్వలను దృష్టిలో పెట్టుకుని రేషన్ బియ్యాన్ని 5 కిలోల నుంచి 10 కిలోలకు పెంచాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే డిసెంబర్‌లో 'మార్చ్ టు గోడౌన్స్' పేరుతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అసైన్డ్ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలను అడ్డుకుంటామని, ఉపాధి హామీ పథకాన్ని ఏడాదికి 200 రోజులకు పెంచి రోజువారీ కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15 నుంచి నల్గొండలో జరిగే అఖిల భారత రైతు సంఘం మహాసభలకు తెలంగాణ నుంచి లక్ష మందితో తరలివెళ్తామని తెలిపారు. వచ్చే ఫిబ్రవరి 14 నుంచి 17 వరకు బెంగళూరులో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతికి సంతాపం తెలిపి, కార్మికుల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, పడిగల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో అన్నదానం



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భువనగిరి మండలం అనాజిపురం గ్రామంలో కొండపై గుహలో వెలిసిన స్వయంభు ఓలేశ్వర శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో బుధవారం సిరికొండ వెంకటేష్ సంతోష ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, స్వామి వారి సన్నిధిలో అన్న ప్రసాద వితరణ గావించారు. సిరికొండ వెంకటేష్ ధర్మపత్ని సంతోష, వారి కుమారులు భార్గవ్, వరుణ్, మాత తల్లి లలిత ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది

తుఫాన్ బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలి

మాజీ ఎంపీ నామ

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 4 : ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మురుసు తుఫాన్ ప్రభావంతో వేలాది ఎకరాల్లో సాగు చేసిన వరి, పత్తితో పాటు ఇతర పంటలు తీవ్రంగా దెబ్బతినడం పట్ల బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన పంటలు తుఫాన్ వర్షాల కారణంగా నీటమునిగి, నేలకొరిగి రైతులకు ఎనలేని నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యంతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులతో త్వరితగతిన సమగ్ర సర్వే నిర్వహించి, పంట నష్టాన్ని ఖచ్చితంగా అంచనా వేసేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని నామ నాగేశ్వరరావు కోరారు. పంటలు దెబ్బతిన్న ప్రతి రైతునూ పారదర్శకంగా గుర్తించి, తగిన నష్టపరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికే అధిక పెట్టుబడులు, సాగు ఖర్చుల భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు తుఫాన్ మరింత కోలుకోలేని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న రైతాంగానికి ప్రభుత్వం పూర్తి అండగా నిలిచి, వారు మళ్లీ నిలదొక్కుకునేలా అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

కలెక్టర్ దివాకర

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 4 : జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ దివాకర టిఎస్ హెచ్చరించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి అధికారులు, లీగల్ మెట్రోలజి, మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి విక్రయ కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టిక ఫ్లెక్సీలను స్పష్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బీపీటీ, కేఎన్ఎం రకాలు కిలో రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాలు రూ.79 చొప్పున విక్రయించాలని స్పష్టం చేశారు.నిబంధనలు ఉల్లంఘించి అక్రమ నిల్వలకు పాల్పడినా, ఎక్కువ ధరలకు విక్రయించినా నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం సరుకును స్వాధీనం చేసుకుని వేలం వేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించి ధరలను నియంత్రించాలని సూచించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డిఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున బాబు పాల్గొన్నారు.




బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు

ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు

ముద్ర, సూర్యాపేట, నవంబర్ 4: గోదాంలలో బియ్యం నిల్వలు, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యం నాణ్యతను కాపాడటంతో పాటు నిల్వల నిర్వహణలో నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.బుధవారం కోదాడ సమీపంలోని బాలాజీనగర్‌లో ఉన్న ఎస్‌డబ్ల్యూసీ గోదాంను జిల్లా ఎస్పీ కె. నరసింహతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న బియ్యం పరిమాణం, నిర్వహణ తీరును పరిశీలించారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేయడంతో పాటు బియ్యం నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. పరీక్షల ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాంలలో బియ్యం నిల్వ చేసే విధానం, భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ముఖ్యంగా ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ఐఎఫ్ఓ) విధానాన్ని అమలు చేయాలని, ముందుగా వచ్చిన నిల్వలను ముందుగా పంపిణీకి పంపించాలని ఆదేశించారు. స్టాక్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని గోదాం మేనేజర్, సాంకేతిక సహాయకులకు సూచించారు.ఆరు గోదాంల హమాలీలకు లేబర్ కార్డులుగోదాంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు లేబర్ కార్డులు మంజూరు చేయించాలని హమాలీలు కోరడంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత కార్మిక శాఖ అధికారితో మాట్లాడి జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీవో సూర్యనారాయణ, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తహసీల్దార్ సంతోష్ కిరణ్, ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ సందీప్, సాంకేతిక సహాయకులు భాస్కర్ రెడ్డి, అరుణ పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబం అరాచకాలను అరికట్టాలని అఖిలపక్షం ధర్నా





ఎంపీడీవోకు వినతి పత్రం

ముద్ర, మోటకొండూర్: కదిరేణిగూడెం సర్పంచ్ జెట్ట లత, ఆమె భర్త జెట్ట మహేశ్వర్, కుటుంబ సభ్యుడు జెట్ట లక్ష్మణ్ గ్రామంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ కుల విభేదాలు సృష్టిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మోటకొండూర్ ఎంఆర్సీ భవనం వద్ద మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా ధర్నా నిర్వహించి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ వేముల పాండు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పైళ్ల గణపతిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ సర్పంచ్ భర్త పంచాయతీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. పారిశుద్ధ్య కార్మికుల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా గత నెల 27న కోమటిరెడ్డి చంద్రారెడ్డి తల్లి కమలమ్మ ప్రమాదానికి గురై కాలు విరిగించుకుందని తెలిపారు. ఈ ఘటనపై గ్రామసభలో ప్రశ్నించిన చంద్రారెడ్డిని దుర్భాషలాడి బెదిరించడమే కాకుండా ఆయనపై అక్రమ కేసు పెట్టించారని ఆరోపించారు. సర్పంచ్ గ్రామంలో అందుబాటులో ఉండటం లేదని విమర్శించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం దెబ్బతినకుండా అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమానికి సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కొప్పుల వెంకటరెడ్డి సంఘీభావం తెలిపారు. పలువురు అఖిలపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ఏఎన్ఎం ప్రవేశాల దరఖాస్తు గడువు 10 వరకు పొడిగింపు

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 4 : ప్రభుత్వ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) ట్రైనింగ్ స్కూల్‌లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం ఏఎన్ఎం శిక్షణ కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును నవంబర్ 10వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పి. అనురాధ దేవి తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.17 ఏళ్లు నిండి, ఇంటర్ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తెలంగాణ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్ www.chfw.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 200 ను హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యేలా “Commissioner of Health & Family Welfare, Telangana, Hyderabad” పేరిట నేషనలైజ్డ్ బ్యాంకు నుంచి డిమాండ్ డ్రాఫ్ట్ (DD) తీయాల్సి ఉంటుందని వివరించారు.ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన దరఖాస్తు ప్రింటౌట్‌తో పాటు పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల జాబితాలు, కుల ధృవీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ, బీసీలకు), 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బోనాఫైడ్ సర్టిఫికెట్లు, నివాస ధృవీకరణ పత్రాలను జతచేసి నవంబర్ 10 లోగా ప్రభుత్వ మహిళా బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల శిక్షణ పాఠశాల ప్రిన్సిపాల్‌కు లేదా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను నవంబర్ 15 నాటికి పూర్తి చేసి, నవంబర్ 16 నుంచి తరగతులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 8919393686, 8374706381 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 5.11.2026
www.mudranews.in | @mudranews

నిద్ర, ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి!

చలికాలంలో శరీర రోగని రోధక వ్యవస్థ సాధారణంగా పనిచేయాలంటే తగినంత నిద్ర, పోషకాహారం అవసరం. పండ్లు, కూరగాయలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలి. వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడకూడదు.



ఏటా రూ.100కోట్ల బడ్జెట్ కేటాయించే వరకు పోరాటం

*** తురక కాశ హక్కుల సాధనకై ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి...**
*** జిల్లా సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు షేక్ బడేసాబ్ పిలుపు**
*** కొండాపూర్ లో జిల్లా అధ్యక్షుడు కాసిం అధ్యక్షతన సమావేశం నిర్వహణ**



ముద్ర
చిగురుమామిడి: తురక కాషా సంక్షేమం కోసం ప్రతి ఏటా రూ.100కోట్ల బడ్జెట్ కేటాయించే వరకు పోరాటం ఆగేది లేదని తురక కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బడేసాబ్, జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసీంలు తెలిపారు.తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో బుధవారం పెద్ద ఎత్తున నిర్వహించారు.కరీంనగర్ జిల్లా తురక కాశ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ కాసిం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ బలోపేతం,భవిష్యత్తు కార్యాచరణ,ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బడేసాబ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ షరీఫ్, లీగల్ సెల్ ఇంచార్జ్ సయ్యద్ జామిన్ భాష లు హాజరయ్యారు.ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తురక కాశలను ఐక్యం చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.సమాజంలో వెనుకబడిన తురక కాశలందరూ తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఏకతాటిపైకి వచ్చి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రభుత్వాలు తురక కాశల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయకుండా,వారి సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి ఏటా బడ్జెట్ లో రూ.100కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఈ బడ్జెట్ ను అధికారికంగా కేటాయించే వరకు తురక కాశల న్యాయపోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగేది లేదని స్పష్టం చేశారు.ముఖ్యంగా సమాజంలో మార్పు తీసుకురావడానికి యువత కీలక పాత్ర పోషించాలని, యువతీ యువకులు మొద్దు నిద్ర వీడి తురక కాశల హక్కుల సాధన కోసం కదలి రావాలని, పోరాటాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ మహాసభలో కొండాపూర్ గ్రామ సర్పంచ్ మార్క రాజ్ కుమార్ గౌడ్ తోపాటు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ రహీం, వలి, ప్రముఖ నాయకులు షేక్ షాదుల్లా, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు జానీ, నిజామాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ కరీం,అఫ్జల్,జిల్లా వ్యాప్తంగా ఉన్న తురక కాశ సంఘాల ప్రతినిధులు, సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు తెలంగాణ మంత్రివర్గ అనధికారిక సమావేశం

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026పై చర్చ

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ అనధికారిక సమావేశం నవంబర్ 5వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జాజు పేరుతో కాకుండా సంజయ్ జాజు జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల్లో సమావేశ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ప్రధానంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. సమావేశానికి హాజరుకావాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులకు ఆహ్వానం పంపించారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగం) నవంబర్ 4వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది.

సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి

పెద్దపల్లి జిల్లాలో 1 మెగావాట్ సోలార్ ప్లాంట్ గ్రిడ్‌కు అనుసంధానం



ముద్ర, పెద్దపల్లి, : పెద్దపల్లి జిల్లాలో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 1 మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్‌ను విద్యుత్ గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానం చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. జిల్లాలో ఒక్కొక్కటి 1 మెగావాట్ సామర్థ్యంతో మొత్తం నాలుగు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బుధవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్‌లోని ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో సోలార్ ప్లాంట్ సింక్రనైజేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సహకార సంఘాల ద్వారా రాష్ట్రంలోనే నాలుగు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన జిల్లాగా పెద్దపల్లి గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), సిబ్బంది సమష్టి కృషితో ఈ ప్రాజెక్టులు పూర్తయ్యాయని అభినందించారు. రాఘవపూర్‌లో 1 మెగావాట్ సోలార్ ప్లాంట్ సింక్రనైజేషన్ విజయవంతంగా పూర్తయిందని, ఇకపై ప్రతిరోజూ విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. మిగిలిన ఏర్పాట్లను పూర్తి చేసి సోలార్ ప్లాంట్లను అధికారికంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే వారం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే సమయాన్ని బట్టి రాఘవపూర్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్, రెడ్‌కో డీఎం మనోహర్, టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి రూ.5 లక్షల విలువైన వెండి కానుకలు



ముద్ర, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు వెండి కానుకలను సమర్పించారు. వరంగల్‌కు చెందిన తనుగుల రత్నాకర్, అన్నపూర్ణ దంపతులు సుమారు 2 కిలోల బరువు గల వెండి గంప, బిందె, ప్లేట్‌ను తయారు చేయించి స్వామివారికి కానుకగా అందజేశారు. వాటి విలువ సుమారు రూ. 5 లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. రాజన్న ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈవో రమాదేవికి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్ కుమార్, ఇతర ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిజం విశ్వసనీయతకు సవాల్..

-ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం!
- ప్రజా సమస్యలపై ప్రశ్నించే ధైర్యం కోల్పోవద్దు
- ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి.
- దారి తప్పుతున్న జర్నలిజాన్ని గాడిలో పెట్టాలి.
- నకిలీ జర్నలిస్టుల బ్లాక్‌మెయిలింగ్‌కు అడ్డుకట్ట వేయాలి.
- జర్నలిస్టుల హక్కుల సాధనలో రాజీపడేది లేదు.
- రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ.



ముద్ర, హైదరాబాద్ : జర్నలిజం రంగంలో పెరుగుతున్న సవాళ్లు, వృత్తి విశ్వసనీయతపై తలెత్తుతున్న ప్రశ్నలు ఇప్పుడు మీడియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఒకప్పుడు సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించుకున్న జర్నలిజం.. ప్రస్తుతం కొన్ని పరిణామాల కారణంగా విమర్శలను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా జర్నలిస్టుల ముసుగులో కొందరు సాగిస్తున్న బ్లాక్ మెయిలింగ్ వ్యవహారాలు వృత్తి ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు ఆత్మపరిశీలన చేసుకుంటూ వృత్తి విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

రామచంద్రాపురంలో బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అధ్యక్షతన నిర్వహించిన టీయుడబ్ల్యూ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం, ప్రసారం చేయడం మాత్రమే కాదని, సమాజంలోని అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చి ప్రజల పక్షాన నిలబడటమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే విషయంలో జర్నలిస్టులు ఎలాంటి భయాలకు లోనుకావద్దని సూచించారు.

మరోవైపు, జర్నలిస్టుల పేరుతో నకిలీ గుర్తింపులు సృష్టించుకుని అధికారులను, వ్యాపారులను బెదిరిస్తూ బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడుతున్న వారిపై సంఘాలు దృష్టి సారించాలని అన్నారు. ఇలాంటి వ్యక్తుల కారణంగా నిజాయితీగా పనిచేస్తున్న జర్నలిస్టులు కూడా అనుమానాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ జర్నలిస్టుల వ్యవహారాలకు అడ్డుకట్ట వేయడం ద్వారా వృత్తి గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో విస్తరించిన టీయుడబ్ల్యూ యూనియన్ కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఏదైనా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం విషయంలో రాజీపడకూడదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్తామని చెప్పారు. మీడియా అకాడమీ ద్వారా జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ మారుతున్న మీడియా పరిస్థితులకు అనుగుణంగా జర్నలిస్టు సంఘాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందన్నారు.

ఈ సమావేశంలో ఐజేయు ఉపాధ్యక్షుడు వై. నరేందర్ రెడ్డి, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యుడు మాజీద్, జాతీయ కార్యవర్గ సభ్యుడు కొణిజేటి సత్యనారాయణ, టి యు డబ్ల్యూ జే నాయకులు ఎం.ఏ.కే. ఫైసల్, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మధు గౌడ్, రాజేష్, మహిళా జర్నలిస్టు నాయకులు అరుణ, రాజేశ్వరి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి తిమింగళం ఇళ్లలో ఏసీబీ సోదాలు

రూ.4.75 కోట్ల విలువైన ఆస్తులను ఏసీబీ గుర్తించింది
కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ నుంచి జీహెచ్ఎంసీ మెప్మా అదనపు డైరెక్టర్ గా నల్లగుంట్ల యాదగిరిరావు ప్రస్థానం



ముద్ర, కరీంనగర్: మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్ (మెప్మా) అదనపు డైరెక్టర్ నల్లగుంట్ల యాదగిరిరావు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్టు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. మంగళవారం హైదరాబాద్, సూర్యాపేట సహా పది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఆయన నివాసం, కార్యాలయం, బ్యాంకు లాకర్లు, బంధువులు, సన్నిహితులు, బినామీలకు సంబంధించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. స్థిర, చరాస్తులకు సంబంధించిన పలు కీలక పత్రాలు గుర్తించారు. ఆయన ఆస్తుల వి లువ అధికారిక లెకల ప్రకారం రూ.4,75,61,171గా అంచనా వేశారు.

2007లో గ్రూప్–1 పరీక్ష రాసి మున్సిపల్ శాఖలో గ్రేడ్–2 మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగంలో చేరారు. – దాదాపు రెండు దశాబ్దాలుగా మున్సిపల్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేశారు. – జీహెచ్ఎంసీలో డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్‌గా పనిచేశారు. కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మెప్మాలో అదనపు డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్నట్లు వార్తలు పేర్కొన్నాయి.

ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు ఆయన నివాసం, కార్యాలయం, బంధువులు, సన్నిహితులు, అనుమానిత బినామీలకు సంబంధించిన మొత్తం 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు.

ఏసీబీ గుర్తించిన ఆస్తుల వివరాలు:

ఆస్తుల వివరాలు	అంచనా విలువ
12 ఓపెన్ ప్లాట్లు	రూ. 58.63 లక్షలు
ఉప్పల్‌లో రెండు ఫ్లాట్లు	రూ. 31.36 లక్షలు
జీ+3 భవనం, పెంట్‌హౌస్	రూ. 2 కోట్లు
బంగారు ఆభరణాలు	రూ. 33.82 లక్షలు
వెండి (3 కిలోలు)	రూ. 1.80 లక్షలు
రెండు కార్లు	రూ. 73 లక్షలు
బ్యాంకు నిల్వలు	రూ. 32.30 లక్షలు
ఇతర ఆస్తులు, గృహోపకరణాలు అదనం	

మొత్తంగా సుమారు రూ.4.75 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ కథనాలు వెల్లడించాయి. బహిరంగ మార్కెట్ విలువ ఇంకా ఎక్కువగా ఉండవచ్చని అంచనా. ఆయనను అరెస్టు చేసి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. యాదగిరిరావు గతంలో కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ఆ సమయంలో వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఆయనను బదిలీ చేసినట్లు తెలిసింది.

బేతుపల్లి చెరువులో 11 మంది ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది గల్లంతు

ముద్ర, ఖమ్మం : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువులో జాలర్లను రక్షించేందుకు వెళ్లిన 11 మంది ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది బోట్లు బోల్తా పడటంతో గల్లంతయ్యారు. భారీ వర్షాలకు చెరువు అలుగు పారుతుండగా ఐదుగురు జాలర్లు వరదలో చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు వెళ్లిన సహాయక బృందాల బోట్లు ప్రమాదానికి గురయ్యాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. భద్రాచలం నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీసి, గల్లంతైన సిబ్బందిని సురక్షితంగా తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. చిక్కుకున్న జాలర్లు సురక్షితంగా ఉన్నట్లు సమాచారం.

కార్పొరేషన్ అవినీతిపై చర్యలు తీసుకోవాలి

సొంత కార్పొరేటర్లనే హెచ్చరించిన బండి సంజయ్..
అవినీతిని నిరూపించి చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్ నేత అంజన్ కుమార్



ముద్ర, కరీంనగర్: నగరపాలక సంస్థలో అవినీతి జరుగుతోందని స్వయంగా కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ తన పార్టీ కార్పొరేటర్లను హెచ్చరించడం చూస్తుంటే పరిస్థితి అర్థమవుతోందని కాంగ్రెస్ నాయకుడు వైద్యుల అంజన్ కుమార్ విమర్శించారు. కార్పొరేటర్లు అవినీతికి పాల్పడుతున్నారని, తనకు ఫిర్యాదులు అందాయని, బ్లాక్‌లిస్ట్‌లో పెడతానని హెచ్చరించిన బండి సంజయ్.. అవినీతిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కరీంనగర్ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. నగర అభివృద్ధికి నిధుల వరద తెచ్చామని చెప్పుకుంటున్న బండి సంజయ్ ఇప్పటివరకు కేంద్రం నుంచి ప్రత్యేకంగా ఎన్ని నిధులు తీసుకొచ్చారో స్పష్టం చేయాలని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు UIDF నిధులతో చేపడుతున్నవేనని, ఇందులో కేంద్రం వాటా 25 శాతం, రాష్ట్రం వాటా 25 శాతం కాగా, మిగిలిన 50 శాతానికి రాష్ట్ర ప్రభుత్వమే గ్యారెంటీ ఇస్తోందని వివరించారు.

గత పాలకవర్గం హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కోట్లాది రూపాయల అవినీతిపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రస్తుత పాలకవర్గం, గత బీఆర్ఎస్ పాలకవర్గం మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపించారు. నగరంలో జరుగుతున్న అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసి సమగ్ర విచారణతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతామని తెలిపారు.

ఈ పాత్రికేయ సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, గంట శ్రీనివాస్, కాంతల జగన్ రెడ్డి, చరకొండ బుచ్చిరెడ్డి, పడిశెట్టి భూమయ్య, కల్లపల్లి బాలరాజు సరిల్ల ప్రసాద్, కంకణాల అనిల్, ఇమ్రాన్, సత్రం శ్రీకాంత్, పహాడ్ పెంట శేఖర్ శ్రీకాంత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

రూ. 77 కోట్లతో పెద్దపల్లి పట్టణం అభివృద్ధి..


- రూ. 7 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్..
అభివృద్ధికి అందరూ సహకరించాలి..
- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పట్టణాల అభివృద్ధి..
- రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు..



ముద్ర, పెద్దపల్లి : పెద్దపల్లి పట్టణంలో రూ.62.23 కోట్ల యూ.డి.ఐ.ఎఫ్ నిధులు మంజూరు చేసుకోవడం జరిగిందని వాటితో పెద్దపల్లి పట్టణం సుందరంగా మారుతుందని అన్నారు. పట్టణంలో గత సంవత్సరం టీ.యూ.ఎఫ్.ఐ.డి.సి నిధుల ద్వారా రూ.35 కోట్లు మంజూరు చేసి పట్టణంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. అలాగే డి.ఏం.ఎఫ్.టి నిధుల ద్వారా రూ.15 కోట్లు మంజూరు చేసుకుని శరవేగంగా పలు వార్డుల్లో అభివృద్ధి చేశామని పెద్దపల్లి పట్టణంలో రూ. 7 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ఏర్పాటు చేస్తున్నామని నిధులు కూడా మంజూరు అయ్యాయని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని రోడ్ల మరియు డ్రైనేజీల నిర్మాణ విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించి అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని సూచనలు చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతన బస్సు డిపో, బైపాస్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, డబల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్లు మరియు అనేక రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రజలందరూ గమనించాలి అని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు, అభివృద్ధి పనులు అవసరం ఉన్నా ప్రజా ప్రతినిధులను అధికారులను సంప్రదించాలని వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు మరియు పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని గుర్తు చేశారు. పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
గురువారం 05.11.2026

దగ్గు, జలుబును నిర్లక్ష్యం చేయకండి



తుమ్ములు, గొంతునొప్పి, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే తేలికగా తీసుకోకూడదు. లక్షణాలు ఎక్కువ వుతున్నా, ఎక్కువ రోజులు కొనసాగుతున్నా వైద్యులను సంప్రదించాలి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతినొప్పి ఉంటే వెంటనే వైద్య సహాయం పొందాలి.

ఇరాన్‌పై మళ్లీ దాడులు



ఖేష్మ్ ద్వీపంపై అమెరికా క్షిపణుల వర్షం

ముద్ర, వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హొర్ముజ్ జలసంధిలో ఇరాన్‌కు చెందిన లక్ష్యాలపై అమెరికా దాడులు జరిపింది. ఈ విషయాన్ని అమెరికా అధికారి ఒకరు వెల్లడించినట్టు అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరుగుతున్న వేళ ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. అయితే ఇవి పరిమిత స్థాయిలోనే జరిగిన సైనిక చర్యగా భావిస్తున్నారు. ఇరాన్ ప్రభుత్వ మీడియా కథనాల ప్రకారం.. ఖేష్మ్, హెంగామ్ దీవుల తోపాటు సమీపంలోని ప్రధాన భూభాగ ప్రాంతమైన బందర్ అబ్బాస్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. గతంలో జరిగిన దాడుల మాదిరిగా ఈసారి అమెరికా ముందుగా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడులు చేయబోమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో ప్రకటించారు. అయితే, ఇప్పుడు దాడులు జరగడం ఆయన వైఖరిలో మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నది. ఇరాన్‌తో యుద్ధం, దాని ప్రభావంతో అమెరికాలో పెరిగిన పెట్రోల్ ధరలు, ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారం.. కాంగ్రెస్‌పై పట్టు నిలుపుకోవాలని భావిస్తున్న ట్రంప్, రిపబ్లికన్ పార్టీకి ప్రతికూలంగా మారాయి.

10 లక్షల మంది స్వచ్ఛంద సైనికులకు ఇరాన్ శిక్షణ

అమెరికాతో ఘర్షణలు మళ్లీ తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇరాన్ తన సైనిక సన్నద్ధతను పెంచుతున్నది. దేశవ్యాప్తంగా 10 లక్షల మంది పారామిలిటరీ స్వచ్ఛంద కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా సోమవారం టెహ్రాన్‌లో మూడో సైనిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌కు అనుబంధంగా పనిచేసే బసీజ్ పారామిలిటరీ దళ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వారం నుంచే దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో 1500 శిక్షణ కేంద్రాలు పనిచేయడం ప్రారంభిస్తాయని బసీజ్ శిక్షణ విభాగం డిప్యూటీ అధిపతి అలీ కౌసారీ తెలిపారు.

ఒమన్‌లో భారత నౌకపై దాడి.. గుజరాత్ వాసి మృతి

మన దేశ పతాకంతో వస్తున్న ఒక వాణిజ్య నౌకపై ఒమన్ తీరంలో సోమవారం జరిగిన దాడిలో ఒక భారతీయుడు మరణించాడని ఒమన్ విదేశాంగ శాఖ తెలిపింది. నౌకలో ఉన్న 14 మంది భారతీయుల్లో 13 మందిని ఒమన్ కోస్ట్‌గార్డు రక్షించిందని పేర్కొంది. ఎంఎస్‌వీ ఏఎల్ జేయూఎస్‌యూఎఫ్ఐ పేరుగల వాణిజ్య నౌకపై ఒమన్‌లో లిమ్హా సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు వైమానిక దాడి జరిపారని కేంద్ర పోర్టులు, నౌక, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద సోనావాల్ తెలిపారు. ఈ దాడిలో గుజరాత్‌కు చెందిన గాంధార్ నహీమ్ అజిత్ మరణించాడని పేర్కొంటూ ఆయన కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ దాడిపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.

ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

31 మంది దుర్మరణం
48 మంది గల్లంతు, 62 మందికి గాయాలు



ముద్ర, కీవ్: ఉక్రెయిన్‌లోని కొమిషువ కాలోని ఓ స్కూల్ భవనంపై రష్యా సోమవారం తొమ్మిది బాంబులు వేయడంతో కనీసం 31 మంది దుర్మరణం చెందారు. 48 మంది గల్లంతయ్యారు. ఈ భవనాన్ని షెల్టర్‌గా, మానవతా సాయం పంపిణీ కేంద్రంగా వాడుతున్నట్టు స్థానిక గవర్నర్ సెమికిన్ తెలిపారు. ఈ దాడిని అత్యంత భయానకమైనదిగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభివర్ణించారు. అమెరికా మధ్యంతర ఎన్నికలు జరుగుతున్న తరుణంలో కాల్పుల విరమణ పాటించాలన్న అమెరికా సూచన పెడచెవిన పెట్టి రష్యా ఈ దాడులకు పాల్పడిందని విమర్శించారు.అంతకు ముందు తమ దేశ ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా రష్యా వందలాది డ్రోన్లు, డజన్ల కొద్దీ శక్తివంతమైన క్రూయిజ్, ఖండాంతర క్షిపణులను ప్రయోగించిందని ఆయన వెల్లడించారు. 'మా గగనతలాన్ని రక్షించుకోవడానికి సహాయం కావాలి. లేకపోతే రష్యా తన క్షిపణి దాడులను ఎప్పటికీ ఆపదు. నిజాయితీగా శాంతిని నెలకొల్పడంలో సహాయం అత్యవసరం.

అమెరికా ఆ పని చేయగలదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఖర్కీవ్‌పై జరిగిన మరో దాడిలో కనీసం 62 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు తెలిపారు. మంగళవారం ఉక్రెయిన్‌లోని కొన్ని ప్రాంతాల్లో దవాఖానలపై రష్యా దాడులు చేసింది. మరోవైపు సోమవారం రాత్రి 856 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్టు రష్యా రక్షణ మంత్రి తెలిపారు. ఇందులో 493 డ్రోన్లు రాజధాని మాస్కోపై ప్రయోగించారని నగర మేయర్ సబ్యానిన్ వెల్లడించారు.

మణిపూర్‌లో ప్రత్యర్థి నాగా వర్గాల మధ్య కాల్పులు

నలుగురు మిలిటెంట్లు మృతి



ముద్ర. ఇంఫాల్: మణిపూర్‌లో రెండు ప్రత్యర్థి నాగా వర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇరు వర్గాలకు చెందిన నలుగురు మిలిటెంట్లు మరణించారు. భయాందోళన చెందిన ప్రజలు తమ ఇళ్లను వదిలి పారిపోయారు. మణిపూర్‌లోని నోనీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో టావోదైజింగ్ గ్రామంలో నాగా ప్రత్యర్థి వర్గాలైన జెలియాంగ్‌రాంగ్ యునైటెడ్ ఫ్రంట్ (జెంచుయ్ వర్గం) జెడ్‌యూఎఫ్(జే), నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగలిమ్ (ఎన్ఎస్‌సీఎన్-ఐఎం)కు చెందిన మిలిటెంట్ల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో పరస్పరం కాల్పులు జరుపుకున్నారు. జెడ్‌యూఎఫ్(జే)కు చెందిన ముగ్గురు మిలిటెంట్లు, (ఎన్ఎస్‌సీఎన్-ఐఎం)కు చెందిన ఒక మిలిటెంట్ ఈ కాల్పుల్లో మరణించారు.

కాగా, నాగా ప్రత్యర్థి వర్గాల ఘర్షణ, కాల్పులకు గ్రామస్తులు భయాందోళన చెందారు. తమ ఇళ్లను వీడి పారిపోయారు. ఇతరులను హెచ్చరించడానికి, ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ లౌడ్ స్పీకర్ల ద్వారా గ్రామస్తులు హెచ్చరించారు. నాగా ప్రత్యర్థి వర్గాల మధ్య కొన్ని గంటల వరకు నిరంతరాయంగా కాల్పులు జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

మరోవైపు ప్రాదేశిక నియంత్రణ, ఈ ప్రాంతంపై పట్టు కోసం ప్రత్యర్థి నాగా మిలిటెంట్ గ్రూపుల మధ్య హింసాత్మక సంఘటనలు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. తాజా కాల్పులకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అయితే సాయుధ బృందాలు ఘర్షణ విరమించి శాంతికి అవకాశం ఇవ్వాలని నుంగ్బా ప్రాంతానికి చెందిన రోంగ్‌మే నాగా లుపువామ్ విజ్ఞప్తి చేసింది.

పైరేట్ల నుంచి 20 మంది నావికులకు విముక్తి



ముద్ర, మొగాదిషు: సోమాలియా సముద్రపు దొంగల చెరలో చిక్కుకున్న ఇరాన్‌కు చెందిన ఫిషింగ్ నౌక 'అజిని'ని భారత నౌకాదళం విజయవంతంగా విడిపించింది. నౌకలో ఉన్న 20 మంది ఇరాన్ సిబ్బందిని రక్షించింది. ముంబైకి సుమారు 3,000 కిలోమీటర్ల దూరంలో ఈ ఆపరేషన్ నిర్వహించడం విశేషం. గురువారం సోమాలియా ఈశాన్య తీరంలో 12 మంది సాయుధ దొంగలు ఈ నౌకను హైజాక్ చేశారు. అనంతరం భారత నేవీ 48 గంటల పాటు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి సోమవారం నౌకను తమ ఆధీనంలోకి తీసుకుంది.

మూడు దశాబ్దాలు.. 31 వేల మైళ్ల సాహసయాత్ర



ముద్ర, లండన్: సుమారు మూడు దశాబ్దాల కాలం.. 31 వేల మైళ్ల సుదీర్ఘ ప్రయాణం.. ప్రపంచ యాత్ర చేసిన బ్రిటీష్ సాహసికుడు కార్ల్ బుష్బీ సొంత ఇంటికి చేరుకోవడంతో ఆయనకు ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. 28 ఏండ్ల వయసులో ప్రయాణాన్ని ప్రారంభించిన బుష్బీ 57 ఏండ్ల వయసులో 28 ఏండ్ల తర్వాత హల్ నగరంలోని సోమవారం తన గృహానికి చేరుకున్నారు. వందలాదిమంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. కుమారుడిని చూసి ఆయన తల్లి తీవ్ర ఉద్వేగంతో ఆలింగనం చేసుకుంది. ఆమెతో పాటు ఆయన 36 ఏండ్ల కుమారుడు, 12 ఏండ్ల మనవరాలు ఆయనను చూసి ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అడవులు, ఎడారులు, గడ్డకట్టిన భూభాగాలు, ప్రపంచంలోని అత్యంత కఠినమైన సరిహద్దుల గుండా సాగుతూ ప్రపంచ వ్యాప్తంగా 31 వేల మైళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని ఆయన పూర్తి చేశారు.


చిన్నారిపై లైంగిక వేధింపులు..
మాల్దీవుల మాజీ విదేశాంగ మంత్రి అరెస్టు



ముద్ర, మాలే: మాల్దీవుల మాజీ విదేశాంగ మంత్రి అబ్దుల్లా షాహిద్ ను పోలీసులు అరెస్టు చేశారు. చిన్నపిల్లలను లైంగికంగా వేధించినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మాల్దీవు పోలీసులు సోమవారం దీనిపై ఓ ప్రకటన రిలీజ్ చేశారు. కోర్టు వారెంట్ ప్రకారం రాత్రి 9.59 నిమిషాలకు మాజీ మంత్రి అబ్దుల్లాను అరెస్టు చేసినట్లు చెప్పారు. గతంలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ప్రెసిడెంట్‌గా చేశారాయన. వాస్తవానికి 2028లో జరగబోయే దేశాధ్యక్ష ఎన్నికల్లో ఆయన మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేయాల్సి ఉన్నది. 64 ఏళ్ల అబ్దుల్లా 18 లోపు ఉన్న చిన్నారిని లైంగికంగా వేధించినట్లు అనుమానాలు ఉన్నాయని, నవంబర్ 2న కోర్టు వారెంట్ ఆధారంగా ఆయన్ను అదుపులోకి తీసుకున్నామని, ఈ కేసులో పోలీసులు మరింత దర్యాప్తు చేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. అయితే తనపై వచ్చిన ఆరోపణలను షాహిద్ కొట్టిపారేశారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన గురించి చెడుగా ప్రచారం చేయరాదు అని ఆయన కోరారు.

మాల్దీవుల్లో ఉన్న రాజకీయవేత్తల్లో షాహిద్‌కు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉంది. 2018 నుంచి 2023 వరకు ఆయన ఆ దేశ విదేశాంగ మంత్రిగా చేశారు. ఆ సమయంలో దేశాధ్యక్షుడిగా ఇబ్రహీం మొహమ్మద్ సోలి ఉన్నారు. 2021-22 మధ్య కాలంలో యూఎన్ జనరల్ అసెంబ్లీలో అధ్యక్షుడిగా చేశారు. పీపుల్స్ మజ్లిస్ స్పీకర్‌గా చేశారు. 2024 ఫిబ్రవరి నుంచి ఆగస్టు 2026 వరకు మాల్దీవుల డెమోక్రటిక్ పార్టీకి నాయకత్వం వహించారు. గతనెలలోనే ఢిల్లీలో జరిగిన లిటరేచర్ సదస్సుకు షాహిద్ హాజరయ్యారు.స్పేసెస్ వీ కాల్ హోమ్.. డయాస్పోరా అండ్ బిలాంగింగ్ అన్న అంశంపై ఆయన మాట్లాడారు.

దుబాయ్‌లో పార్కులోనే ఆఫీసు



ముద్ర, దుబాయ్: ఉద్యోగమంటే నాలుగు గోడల మధ్య కూర్చుని పనిచేయడమే కాదు.. ప్రకృతి ఒడిలోనూ హాయిగా విధులు నిర్వహించవచ్చు. ఈ వినూత్న ఆలోచనకు దుబాయ్ శ్రీకారం చుట్టింది. తొలిసారిగా 'వర్క్ ఫ్రమ్ పార్క్' కేంద్రాన్ని ప్రారంభించింది. అల్ బర్షా పాండ్ పార్క్‌లో నవంబర్ 2న అందుబాటులోకి వచ్చిన ఈ కేంద్రంలో చెట్ల మధ్య ఉచితంగా పనిచేసుకోవచ్చు.

ఏసీతో కూడిన ఇండోర్ వర్క్ స్పేస్‌లను రోజుకు 50 దిర్హామ్‌ల నుంచి వినియోగించుకోవచ్చు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇవి పనిచేస్తాయి. కుటుంబ సభ్యులతో పార్క్‌కు వస్తూనే ఉద్యోగం చేసుకునే అవకాశం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 05.11.2026
www.mudranews.in | @mudranews

చలికి తగిన దుస్తులు ధరించండి



ఉదయం, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతుండటంతో బయటకు వెళ్లేటప్పుడు వెచ్చని దుస్తులు ధరించాలి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు చలిగాలుల నుంచి రక్షణ పొందేందుకు దుస్తులను పొరలుగా వేసుకోవడం మంచిది.

తాగునీటి ఎద్దడిపై ముందస్తు కార్యాచరణ

సర్ధన చెక్ డ్యాం సందర్శించిన కలెక్టర్ ప్రతిమా సింగ్

ముద్ర ప్రతినిధి, మెదక్: ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడి, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. హవేళి ఘన్‌పూర్ మండలం సర్ధన గ్రామంలోని చెక్‌డ్యామ్‌ను మిషన్ భగీరథ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణం, తహసిల్దార్ సింధు రేణుక, గ్రామ సర్పంచ్ వినోద, ఎలక్ట్రిసిటీ డిఈ రామేశ్వర స్వామి, మిషన్ భగీరథ ఈ.ఈ సంపత్ కుమార్, ఇంట్రా డిఈ నరేష్ తో కలిసి సందర్శించారు.మిషన్ భగీరథ గ్రిడ్ సిబ్బంది ప్రత్యామ్నాయ నీటి సరఫరాకై ఏర్పాటు చేసిన మ్యాప్ పరిశీలిస్తూ పలు కీలక సూచనలు చేశారు డిసెంబర్ తర్వాత సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమస్యను ముందుగానే అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెదక్ జిల్లాకు రూ.42 కోట్ల నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు. సర్ధన చెక్‌డ్యామ్ వద్ద ప్రత్యేక గ్రిడ్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి సుమారు 3.5 కిలోమీటర్ల మేర జక్కన్నపేట గ్రామం వరకు పైప్‌లైన్ కనెక్షన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా 33 గ్రామాలకు ప్రతిరోజూ ఒక్కొక్కరికి 55 లీటర్ల చొప్పున తాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. సర్ధన డ్యామ్‌తో పాటు పొడ్చన్‌పల్లి, కొత్తపల్లి, మిన్‌పూర్ చెక్‌డ్యామ్‌ల వద్ద కూడా గ్రిడ్ వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ నీటి వనరులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.ఎల్ నినో ఎఫెక్ట్ ఉన్న నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ సూచించారు.గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లాలను డమ్మీ చేయాలని, దీని వల్ల నీటి వృధాను అరికట్టాలని సూచించారు. సర్పంచులు గ్రామాలలో గ్రామసభలలో తీర్మానించుకొని సింగిల్, త్రీఫేస్ మోటార్లు నిర్దిష్ట సమయంలోనే ఆన్ చేసి నీటి విడుదల చేసే విధంగా చర్యలు







చేపట్టాలన్నారు. మిగతా సమయాలలో మోటార్ ఆఫ్ చేసి పెట్టుకోవాలన్నారు బోర్లలో భూగర్భ జలాలు సమృద్ధిగా పెరుగుతాయన్నారు. అంతేకాకుండా విద్యుత్ పొదుపు అవుతుందన్నారు.గ్రామాలలో ఉన్న త్రీఫేస్ మోటార్ నుండి నీటిని ట్యాంక్ లోకి వినియోగించుకోవాలని, త్రీఫేస్, సింగల్ ఫేస్ కరెంటు మరమ్మత్తులు గ్రామాలలో బోర్ల ఫ్లసింగ్, డిపెనింగ్, హయరింగ్ సంబంధిత విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి లభ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా పరిస్థితులను నిరంతరం అంచనా వేస్తూ, దీర్ఘకాలిక సమస్యలు ఉన్న ఆవాసాల్లో సరఫరా అంతరాయాలను ముందుగానే గుర్తించాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

తూప్రాన్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్





450కు పైగా ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు పత్రాలు లేని 64 వాహనాలు స్వాధీనం

ముద్ర ప్రతినిధి, మెదక్: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా తూప్రాన్ పట్టణంలోని 2బీహెచ్‌కే కాలనీలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. పర్యవేక్షణలో సుమారు 105 మంది పోలీసు సిబ్బంది పాల్గొని 450కు పైగా ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలులేని 61 ద్విచక్ర వాహనాలు, మూడు త్రిచక్ర వాహనాలు కలిపి మొత్తం 64 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.తనిఖీల్లో భాగంగా నార్కోటిక్ డాగ్ జూబి సహాయంతో ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల ఉనికిని గుర్తించేందుకు తనిఖీలు నిర్వహించారు. ఫింగర్‌ప్రింట్ డివైజ్ ద్వారా వ్యక్తుల వేలిముద్రలను పరిశీలించి గతంలో నేరాలకు పాల్పడిన పాత నేరస్థుల వివరాలను గుర్తించే ప్రక్రియ చేపట్టినట్లు అదనపు ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ వెంకటరాజ గౌడ్, నర్సాపూర్ సీఐ రంగకృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో పాటు సీసీఎస్, షీ టీమ్స్, డాగ్ స్క్వాడ్ బృందాలు పాల్గొన్నారు.

అమెరికాలో కొత్త చరిత్ర..

తొలి ముస్లిం సేనేటర్‌గా అబ్దుల్ ఎల్ సయ్యద్ ఎన్నిక



ముద్ర, మిచిగన్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో కొత్త చరిత్ర లిఖితమైంది. మిచిగన్ రాష్ట్రం నుంచి డెమోక్రటిక్ అభ్యర్థి అబ్దుల్ ఎల్ సయ్యద్(Abdul El-Sayed).. సేనేట్ రేసులో విజయం సాధించినట్లు అంచనా వేస్తున్నారు. రిపబ్లికన్ నేత మైక్ రోజర్స్‌పై ఆయన గెలుపొందినట్లు ప్రాథమిక ఫలితాల ద్వారా తెలుస్తోంది. దీంతో అమెరికా రాజకీయ చరిత్రలో సేనేటర్‌గా గెలిచిన తొలి ముస్లిం నేతగా అబ్దుల్ ఎల్ సయ్యద్ రికార్డు సృష్టించారు. తాజా మధ్యంతర ఎన్నికల్లో అనేక మైలురాళ్లు చోటుచేసుకుంటున్నాయి. డోనాల్డ్ ట్రంప్ పాలనను వ్యతిరేకిస్తూ ఓటర్లు తీర్పును ఇస్తున్నారు. ముస్లిం సేనేటర్ మాత్రమే కాదు.. తొలి నల్లజాతి మహిళా గవర్నర్, తొలి గే మేల్ సేనేటర్, తొలి మహిళా నేటివ్ అమెరికన్ గవర్నర్‌గా డెమోక్రటిక్ అభ్యర్థులు విజయాలు సాధించినట్లు తెలుస్తోంది.

లెఫ్టిస్ట్ అబ్దుల్ ఎల్ సయ్యద్ చాలా తీవ్రమైన పోటీలో పాల్గొన్నారు. మెడికల్ అడ్మినిస్ట్రేటర్ అయిన అబ్దుల్.. మిచిగన్‌లో ఎన్నికల వేళ భారీ ప్రదర్శన చేపట్టారు. హెల్త్‌కేర్‌ను ఫ్రీగా అందిస్తానని చెప్పి ఆయన ఎన్నికల్లో ప్రచారం చేశారు. దీంతో ఎక్కువ స్థాయిలో ఓటర్లను అబ్దుల్ ఆకర్షించారు. మిచిగన్‌లో 78 శాతం ఓట్లను లెక్కించారు. దాంట్లో ఇప్పటి వరకు అబ్దుల్ అధిక్యంలో ఉన్నారు.మిచిగన్‌లో మద్దతుదారులను ఉద్దేశిస్తూ అబ్దుల్ సయ్యద్ మాట్లాడారు. రేసు పోటీపోటీగా ఉన్నా.. తానే గెలిచినట్లు అబ్దుల్ ప్రకటించుకున్నారు.మిచిగన్.. మీకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఎన్నికల ప్రచారం వేళ.. తన మతవిశ్వాసాలను టార్గెట్ చేస్తూ విపక్షాలు ప్రచారం చేశాయని ఆరోపించారు.

ఇండియాతో లింకు..

అబ్దుల్ ఎల్ సయ్యద్‌కు ఇండియాతో కనెక్షన్ ఉన్నది. ఆయన భార్య డాక్టర్ సారా జుకాకుది కోస్టల్ కర్నాటక. ఆమె సైక్రియాట్రిస్ట్. మంగుళూరుకు 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న భత్కల్‌లో సారా ఫ్యామిలీ ఆనవాళ్లు ఉన్నాయి. గతంలో సీఎం బీడీ జెట్టి దగ్గర ఫైనాన్స్ శాఖ డిప్యూటీ మంత్రిగా పనిచేసిన జుకాకు షాంషుద్దిన్ మనువరాలే సారా. అయితే యూనివర్సిటీ ఆఫ్ మిచిగన్‌లో చదువుతున్న సమయంలో ఎల్ సయ్యద్, సారా మధ్య పరిచయం ఏర్పడింది. దక్షిణ భారత కుటుంబం, సంస్కృతి గురించి తాను తెలుసుకున్నట్లు పలు సందర్భాల్లో ఎల్ సయ్యద్ తెలిపారు. నేను అరబ్ కన్నా ఎక్కువగా ఇండియన్‌గా మారిపోయినట్లు ఎన్నికల ప్రచార సమయంలో సయ్యద్ తెలిపారు. భత్కల్‌లో సారా ఫ్యామిలీ కనెక్షన్ ఉన్నా.. ఆమె కుటుంబీకులు అందరూ ప్రస్తుతం బెంగుళూరులో సెటిల్ అయినట్లు తెలుస్తోంది.

కొడిపల్లి ఎస్ఐగా నీరేష్



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లా కొడిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నీరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ డి.వి. శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి మొక్కను అందజేశారు. కొడిపల్లి పోలీస్ స్టేషన్‌లో గతంలో ఎస్ఐగా విధులు నిర్వహించిన అమర్ జిల్లా పోలీస్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకొని, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెంపొందించేలా అంకిత భావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్ఐ నీరేష్‌కు సూచించారు.

భారత నౌకలకు హర్మూజ్‌లో ప్రత్యేక మినహాయింపు



ముద్ర, ఇరాన్: హర్మూజ్ జలసంధి దాటడం కోసం భారత నౌకలకు ఇరాన్ ప్రత్యేక మినహాయింపులు ఇచ్చింది. భార సహా తమ మిత్రదేశాల నౌకలకు హర్మూజ్‌లో ప్రత్యేక మినహాయింపు ఇస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ విధాన కమిటీ డిప్యూటీ ఛైర్మన్ అమీర్ హయత్ పేర్కొన్నారు. ఇతర దేశాల వాణిజ్య నౌకల పై విధించిన ఆంక్షలు లేకుండానే.. ఇక నుంచి భారత్, చైనా, ఇరాక్, ఖతార్ నౌకలు హర్మూజ్ జలసంధిని దాటవచ్చని స్పష్టంచేశారు. భారత్ నుంచి పశ్చిమాసియా దేశాలకు ఔషధాల సరఫరాను సులభతరం చేసే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమీర్ హయత్ తెలిపారు. అయితే ఆయా దేశాల నౌకల నుంచి రవాణా రుసుమును మాత్రం వసూలు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం హర్మూజ్‌లో రవాణా ఆంక్షల నుంచి భారత్, చైనా, ఇరాక్, ఖతార్‌లకు మినహాయింపు ఇచ్చామని, ఇకపై ఆయా దేశాల నౌకలు జలసంధిలో స్వేచ్ఛగా ప్రయాణిస్తాయని, అమెరికన్లు కూడా వాటిని అడ్డుకోరని హయత్ తెలిపారు. ఇరాన్ దౌత్య, ఆర్థిక ప్రయోజనాలకు దోహదం చేస్తాయనే కారణంతోనే ఈ మినహాయింపులు ఇచ్చామని చెప్పారు.భారత్ నుంచి ఔషధాల దిగుమతిని సులభతరం చేయడానికి, చైనా నుంచి రాజకీయ మద్దతు పొందడానికి ఈ చర్యలు చేపట్టామని అమీర్ హయత్ పేర్కొన్నారు. ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గంగా ఉన్న హర్మూజ్‌లో నౌకాయానంపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ సహా మిత్రదేశాల నౌకలకు ఇరాన్ ప్రత్యేక మినహాయింపు ఇవ్వడం గమనించవలసిన విషయం.

బ్యాలెట్‌పై నేను లేను.. లేదంటే గెలిచేవాళ్లం

డోనాల్డ్ ట్రంప్



ముద్ర, న్యూయార్క్: అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు వెలుబడుతున్నాయి. యూఎస్ కాంగ్రెస్‌లో డెమోక్రాట్లు ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. తాజా రిపోర్టు ప్రకారం సేనేట్‌లో కీలక స్థానాలను డెమోక్రాట్లు గెలుచుకున్నారు. ట్రంప్‌నకు చెందిన రిపబ్లికన్ పార్టీకి ఓటర్లు షాకిచ్చినట్లు తెలుస్తోంది. మధ్యంతర ఫలితాలు వెలుబడుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ట్రుత్ సోషల్ అకౌంట్‌లో రియాక్ట్ అయ్యారు. బ్యాలెట్‌పై తాను లేనని, ఒకవేళ బ్యాలెట్‌పై తాను ఉండి ఉంటే, కచ్చితంగా భారీ మెజారిటీతో తాము గెలిచేవాళ్లమని ట్రంప్ అన్నారు. మధ్యంతర ఫలితాలు వెలుబడుతున్న నేపథ్యంలో ట్రంప్ పెద్దగా స్పందించలేదు.

పార్టీ ఓటమికి తానేమీ కారణం కాదన్న రీతిలో ఆయన పోస్టు పెట్టారు. పార్టీ ఓటమికి రిపబ్లికన్ అభ్యర్థులే కారణమన్న రీతిలో ఆయన రియాక్ట్ అయ్యారు. మధ్యంతర ఎన్నికల నిర్వహణ కోసం ట్రంప్ వ్యవహరించిన తీరుపై రిపబ్లికన్లు ఆగ్రహంగా ఉన్నారు. హోజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్, సేనేట్‌లోనూ రికపబ్లికన్లు పట్టు కోల్పోతున్న నేపథ్యంలో ట్రంప్ శైలిపై స్వంత పార్టీలోనే విమర్శలు వస్తున్నాయి. రిపబ్లికన్లకు పట్టు ఉన్న స్థానాల్లో డెమోక్రాట్లు గెలవడం పట్ల ట్రంప్ తన వ్యాఖ్యలను మార్చారు. న్యూయార్క్ టైమ్స్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఆ ఫలితాలకు తాను బాధ్యత వహించబోతున్నట్లు చెప్పారు. విపక్ష పార్టీలతో కలిసి పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నామన్నారు.

ఫలితాల సరళి ఇలా..

జనవరి నాటికి హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ డెమోక్రాట్ల ఆధీనంలోకి వెళ్తుంది.. 229 స్థానాల్లో డెమోక్రాట్లు.. 161 స్థానాల్లో రిపబ్లికన్లు గెలిచే అవకాశాలు డెమోక్రాట్ అడమ్ హామిల్టన్.. కన్సాస్ సేనేట్ సీటును గెలవనున్నారు. టెన్నెస్సీలోని రిపబ్లికన్ నేత బిల్ హెగర్టీ తన సేనేట్ సీటును నిలుపుకోనున్నారు, అర్కాన్సాస్‌లో టామ్ కాటన్ గెలుస్తారు. న్యూ మెక్సికో కొత్త ఎన్నికైన గవర్నర్‌గా దెబ్ హాలాండ్ బాధ్యతలు చేపడుతారు. అర్కాన్సాస్‌లో గవర్నర్‌గా మళ్లి రిపబ్లికన్ సారా హకాబీ శాండర్స్ గెలిచారు.డెమోక్రాట్లు రెండు కొత్త హౌజ్ సీట్లు గెలిచారు. పెన్సిల్వేనియాలో పేగీ కాగ్నెటి, జానెల్లి స్టెల్సన్ గెలిచారు. టెక్సాస్‌లో డెమోక్రాట్ విన్సెంట్ గోంజేలేజ్ గెలుపు.ఓహియో జిల్లాలో డెమోక్రాట్ గ్రేగ్ ల్యాండ్స్‌మాన్ గెలుపు.

వీటో క్యాప్ పోస్టు చేసిన ట్రంప్

ముద్ర, న్యూయార్క్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ భారీ జలక్ తగిలింది. హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌తో పాటు సేనేట్‌లోనూ డెమోక్రటిక్ పార్టీ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆ ఎన్నికల ఫలితాలు వెలుబడుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ట్రుత్ సోషల్ అకౌంట్‌లో కీలక పోస్టు చేశారు. తనకు వీటో పవర్ ఉన్నట్లు ఓ పోస్టు ద్వారా రెడ్ కలర్ క్యాప్‌ను పోస్టు చేశారు. రాబోయే రెండేళ్లు ట్రంప్‌కు గడ్డుకాలం ఉండబోనున్న విషయం ఫలితాల ద్వారా స్పష్టం అవుతోంది. కాంగ్రెస్ ఉభయసభల్లో ఏదైనా బిల్లును ఒకవేళ ప్రతిపక్షం అడ్డుకుంటే అప్పుడు తన వీటో అధికారాన్ని వాడనున్నట్లు ట్రంప్ తన పోస్టు ద్వారా తెలిపారు. డెమోక్రాట్ల మద్దతు ఉన్న బిల్లులను తన వీటో అధికారంతో అడ్డుకోనున్న విషయాన్ని ఆయన తన పోస్టు ద్వార వెల్లడించారు.వీటో అనేది దేశాధ్యక్షుడి వద్ద ఉన్న బలమైన అధికారం అని, పిచ్చి బిల్లులు పాస్ చేస్తే, తాను వీటో చేయబోనున్నట్లు ట్రంప్ చెప్పారు. వీటోతో కొన్ని బిల్లులను అడ్డుకుంటే, అప్పుడు వాళ్లు తలలు పట్టుకుంటారన్నారు. డెమోక్రాట్ల పార్టీలో తనకు తెలిసిన నేతలు ఉన్నారని, వారితో ఇప్పటికే మాట్లాడానని, ఇంకా కొందరు తనతో టచ్‌లో పచ్చేందుకు ఆసక్తిగా ఉన్నారన్నారు. మంచికి చెడుకు తాను పొలిటికల్ పండితుడిని కాబోతున్నట్లు మరో పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555